
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

ఆదివారం 10 నవంబరు 2024



నైట్ షెల్టర్లు.. నామమాత్రమే



వినుకొండ రైల్వే స్టేషన్‌లో..

చలికి వణుకుతూ.. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. ఆకలితో అలమటిస్తూ.. రోగాలతో అల్లాడుతూ.. దాడులు, దౌర్జన్యాల భయంతో ఎందరో అభాగ్యులు, అనాథలు, దిక్కులేని వారు ఎందరో రోడ్డు పక్కల ఆశ్రయం పొందుతూ ఉంటారు. పగలు ఏదోలా కాలం గడిపినా రాత్రిళ్లు వారి బాధలు వర్ణనాతీతంగా ఉంటాయి. ఇలాంటి వారికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఆశ్రయం కల్పించి ఆదరించాలి. సుప్రీంకోర్టు కూడా గతంలో నిరాశ్రయుల ఆశ్రయం కోసం ప్రతీ మున్సిపల్ కేంద్రంలో నైట్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. అయితే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని పట్టణాల్లో కొన్ని దగ్గర్ల పేరుకు మాత్రమే నిరాశ్రయుల వసతిగృహాలను ఏర్పాటు చేయగా, కొన్ని దగ్గర్ల అసలు వాటి ఊసే లేదు. మున్సిపాలిటీల్లో కొన్ని దగ్గర్ల మెప్మా ఆధ్వర్యంలో మరికొన్ని ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థల నిర్వహణలో నైట్‌షెల్టర్లు కొనసాగుతున్నా అవి నామమాత్రంగానే ఉంటున్నాయి. దీంతో ఇక్కడ ఆశ్రయం పొందే అభాగ్యుల కంటే రోడ్లపై ఉండేవారే వందల్లో ఉంటున్నారు. వారం రోజులుగా వీస్తున్న చలి గాలులకు ఇబ్బందులు పడుతూ రోడ్లు, ఫుట్‌పాత్‌లపై రాత్రిళ్లు ఎందరో నిద్రిస్తున్నారు.



పిడుగురాళ్ల బస్టాండ్‌లో నిద్రిస్తున్న యాచకులు

- కనీస సదుపాయాలు కరువు
- నిర్వహణకు నిధుల కొరతని నిర్లక్ష్యం
- రోడ్ల పక్కన, డివైడర్లపై నిరాశ్రయుల ఆశ్రయం
- నిద్రకు.. ఆకలికి అలమటిస్తున్న అభాగ్యులెందరో
- చాలాప్రాంతాల్లో మూత.. కొన్నిచోట్ల పేరుకు మాత్రమే ఏర్పాటు
- సుప్రీంకోర్టు తీర్పు ఉన్నా పట్టించుకోని పుర పాలకులు, అధికారులు



వినుకొండ రైల్వే స్టేషన్‌లో..

వినుకొండ రైల్వే స్టేషన్ వద్ద చలిలో ఆరుబయట నిద్రిస్తున్న నిరాశ్రయులు



(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

గూడు లేని.. ఆదరించే వారు లేని అభాగ్యుల ఆశ్రయం కోసం పట్టణాల్లో నైట్‌షెల్టర్లను ఏర్పాటు చేయాలి. ఇక్కడ ఆశ్రయం కోసం వచ్చే వారికి భోజనం అందించడంతో పాటు రాత్రిళ్లు నిద్రించే సౌకర్యాలు కల్పించాలి. అయితే జిల్లాలోని మున్సిపాల్టీల్లో పేరుకే ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో పేరుకు నైట్‌షెల్టర్లు ఉన్నా అక్కడ ఆశ్రయం పొందేందుకు అభాగ్యులు ఆసక్తి చూపడంలేదు. సరైన సౌకర్యాలు లేవని, అపరిశుభ్రత తదితర కారణాలతో కొందరు, ఈ తెలియక కొందరు నిరాశ్రయుల వసతిగృహాలకు ఆదరణ తగ్గుతుంది. దీంతో చాలామంది రోడ్ల వెంబడి ఫుట్‌పాత్‌లపైనే చలికి వణుకుతూ కాలం వెళ్లదీస్తున్నారు. నైట్‌షెల్టర్లపై అవగాహన పెంచి వాటి సేవలను నిర్భాగ్యులందరికీ అందేలా చేయాల్సిన అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో యాచకులు, ఆదరించేవారు లేని ఒంటరివారు, ఇతర ప్రాంతాల నుంచి పనుల కోసం వచ్చే వారు దుర్భర పరిస్థితుల మధ్య ఫుట్‌పాత్‌లు, అండర్ పాస్‌ల్లో, పార్కులు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్నారు. దాతలు ఎవరైనా భోజనం అందిస్తూ తింటూ, వారిచ్చే దుప్పట్లు కప్పుకుని రోడ్లపైనే కాలం గడుపుతుంటారు. ప్రతీ మున్సిపాల్టీలోనూ నైట్ షెల్టర్లు కొనసాగాల్సి ఉన్నా అధికారులు స్వచ్ఛంద సంస్థలకు అప్పగించి పట్టించుకోవడంలేదు. కొన్ని దగ్గర్ల నిధుల కొరతతో మూసేశారు. షెల్టర్ జోన్లకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలేదు. దీంతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చాలాదగ్గర్ల ఈ వసతిగృహాలు మూతపడ్డాయి. రోడ్లపై ఆశ్రయం పొందేవారు వ్యక్తిగత శుభ్రత లోపించి రోగాల బారిన పడుతున్నారు.

(మిగతా 6వ పేజీలో..)

దాతల ఔదార్యంతో దుప్పట్లు

వర్షాకాలం, చలికాలంలో చలిగాలులకు రోడ్లపై నిద్రించే నిరాశ్రయులు తీవ్రంగా ఇబ్బంది పడుతుంటారు. దోమలతో కంటి మీద కునుకు ఉండదు. రోడ్డు పక్కన చలికి వణుకుతూ కనిపించే వారిని చూసిన వారు మానవత్వంతో స్పందించి ఆహారం, దుప్పట్లు వంటివి అందజేస్తుంటారు. ఇలాంటివారు అందచేసే దుప్పట్లతో చలిగాలులు, దోమల నుంచి రక్షణ పొందుతుంటారు. మళ్లీ కొత్తగా ఎవరైనా దాతలు ఇచ్చే వరకు గతంలో అందజేసిన దుప్పట్లతోనే కాలం వెళ్లదీస్తూ ఉంటారు.

అయ్యో పాపం

గతంలో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, పార్కుల్లో నిర్భాగ్యులు రాత్రిళ్లు ఆశ్రయం పొందేవారు. అధికారులు వీరిని రానీయకుండా కట్టడి చేస్తున్నారు. ఎవరైనా పార్కులు, బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంగణాల్లో నిద్రిస్తున్నా పోలీసులు తరుముకుంటున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వీరంతా రోడ్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇలా రోడ్లపై ఆశ్రయం పొందే పురుషుల కంటే మహిళలు, బాలికల బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. నిరాశ్రయుల్లో వృద్ధులు ఎక్కువగా ఉండడంతో వారి యాతన చెప్పనలివి కాకుండా ఉంది.



చేరెడ్డి మంజులారెడ్డి ఉండవల్లి శ్రీదేవి సజ్జా హేమలత చిలకలపూడి పాపారావు

పదవుల పండుగ

- 3 జిల్లాలు.. 9 మందికి పదవులు
- కష్టానికి, త్యాగానికి అధిష్ఠానం గుర్తింపు
- గుంటూరు నుంచి శ్రీదేవి, దేగల, మన్నవ, చిల్లపల్లిలకు చాన్స్
- పల్నాడు జిల్లా నుంచి మంజులారెడ్డి, గోనుగుంట్లకు అవకాశం
- బాపట్ల నుంచి పాపారావు, రాజశేఖర్‌బాబు, హేమలతలకు అందలం

గుంటూరు, బాపట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొలువుదీరిన దగ్గర నుంచి నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్న నాయకులు పండుగ చేసు కుంటున్నారు. ఐదు నెలలుగా ఎప్పుడు.. ఎవరికి.. ఎలా పదవులు వస్తాయోనని ఎదురుచూస్తోన్న కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం తీపికబురు చెప్పారు. సెప్టెంబరులో ప్రకటించిన తొలి జాబితాలో కొందరికి అవకాశం దక్కగా మిగిలిన వారు పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో శనివారం చంద్రబాబు పెద్దసంఖ్యలో నామినేటెడ్ పదవులను ప్రకటించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో తొమ్మిది మందికి పదవుల పందేరం జరిగింది. కష్టనష్టాలకోర్చి, త్యాగాలకు వెనుదీయక పార్టీ కోసం పని చేసిన నేతలు, కార్యకర్తలకు కూటమి ప్రభుత్వం తగిన గౌరవాన్ని కల్పిస్తోంది. తాజా జాబితాలో గుంటూరు జిల్లా నుంచి తాడికొండ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకురాలు ఉండవల్లి శ్రీదేవి, టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ, మంగళగిరికి చెందిన జనసేన నేత చిల్లపల్లి శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన టీడీపీ మహిళా నేత మంజులారెడ్డి, నరసరావుపేటకు చెందిన టీడీపీ దివ్యాంగ విభాగం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు, బాపట్ల జిల్లాలో రేపల్లెకి చెందిన చిలకలపూడి పాపారావు, బాపట్లకు చెందిన టీడీపీ నేత సలగల రాజశేఖర్‌బాబు, చీరాలకి చెందిన టీడీపీ నాయకురాలు సజ్జా హేమలతలను పదవులు వరించాయి. కాగా సార్వత్రిక ఎన్నికల సమయంలో మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ మూకల దాడులు, దౌర్జన్యాలకు ఎదురు నిలిచి తీవ్రంగా గాయాలపాలైన మంజులారెడ్డికి చంద్రబాబు ప్రత్యేకంగా గుర్తించారు. గడచిన ఎన్నికల్లో టీడీపీ నుంచి బాపట్ల ఎంపీ సీటు అభ్యర్థిత్వాన్ని ఆశించిన సలగల రాజశేఖర్‌బాబు కొన్ని సమీకరణాల నేపథ్యంలో పార్టీ అయనకు సీటు ఇవ్వలేకపోయింది. ప్రస్తుతం ఆయన బాపట్ల జిల్లా టీడీపీ అధ్యక్షులుగా కూడా ఉన్నారు. రెండో జాబితాలో బాపట్ల జిల్లాలో ముగ్గురిని నామినేటెడ్ పోస్టులు వరించగా రెండు టీడీపీ, ఒకటి జనసేన నేతలు దక్కించుకున్నారు. వీరిలో బాపట్లకు చెందిన సీనియర్ టీడీపీ నేత, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సలగల రాజశేఖరబాబును కీలకమైన బాపుడా చైర్మన్ పదవి వరించింది. చీరాలలో టీడీపీ గెలుపులో తనవంతు సహకారం అందించిన బీసీ(దేవాంగ) సామాజికవర్గానికి చెందిన సజ్జా హేమలతకు అధిష్ఠానం ప్రాధాన్యం ఇచ్చింది. ఇక రేపల్లెకు చెందిన మత్స్యకార సామాజికవర్గానికి చెందిన చిలకలపూడి పాపారావుకు కూడా పదవి దక్కింది. ఏపీ మాల వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ పదవి డాక్టర్ పెదపూడి విజయ్‌ను వరించగా ఈయన ప్రస్తుతం పర్చూరు జనసేన పార్టీ ఇన్‌చార్జిగా ఉన్నారు. కానీ ఈయన స్వస్థలం ప్రకాశం జిల్లా పరిధిలో ఉండడంతో పార్టీ ప్రకటించిన జాబితాలో ఈ పదవిని ఒంగోలు కోటాలో చూపించారు.

ఇప్పటికే పలువురికి పదవులు

కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒక విడతలో వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్లను ప్రకటించింది. ఆ తర్వాత టీటీడీ పాలక మండలిలో పలువురుకు అవకాశం కల్పించింది. ఈ క్రమంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా పరిధిలో పలువురికి పదవులు దక్కాయి. సెప్టెంబరు 24న తొలివిడుత నామినేటెడ్ పదవుల జాబితాలో పిల్లి మాణిక్యరావుకు ఏపీలిడ్‌క్యాప్ చైర్మన్ పదవి వరించగా, పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ పదవి మంగళగిరికి చెందిన నందం అబద్ధయ్యను వరించింది. అమరావతి ఉద్యమంలో కీలకంగా పనిచేసిన రాయపాటి శైలజతోపాటు మంగళగిరికి చెందిన పార్థసారథి, తెనాలికి చెందిన కోటేశ్వరరావులకు తొలి జాబితాలో స్థానం దక్కింది. ఇటీవల విడుదలైన టీటీడీ పాలక మండలిలో మంగళగిరికి చెందిన తమ్మిశెట్టి జానకీదేవి, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, తుళ్లూరుకు చెందిన నన్నపనేని సదాశివరావులను సభ్యులుగా నియమితులయ్యారు.

వీర వనితకు అందలం



రెంటచింతల: గడచి న సార్వత్రిక ఎన్నికల్లో మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ మూకల అరాచకాలను పురుషులే తట్టుకోలేకపోయారు. అయితే ఓ మహిళ పోలింగ్ రోజున వైసీపీ మూకల గొడ్డలి దాడితో రక్తం కారుతున్నా వైసీపీ అక్రమాలను అడ్డుకుని వీర వనితగా రాష్ట్ర వ్యాప్తంగా వార్తల్లోకెక్కింది. ఆమే రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చేరెడ్డి మంజులరెడ్డి. చంద్రబాబు శనివారం ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల జాబితాలో ఏపీ శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్(హస్తకళాభివృద్ధి) సొసైటీ చైర్మన్ పదవి ఆమెను వరించింది. రెంటాల గ్రామంలో మే 13న జరిగిన పోలింగ్ రోజున వైసీపీ మూకల అరాచకాలకు అడ్డుగా నిలిచి వీరోచితంగా పోరాడి బూత్‌లో టీడీపీ తరఫున ఏజెంట్‌గా కూర్చొన్నారు. పోలింగ్ బూత్‌కు వెళ్లకుండా అడ్డుకునేందుకు ఆమెపై వైసీపీ వర్గీయులు రోడ్డుపై పడేసి గొడ్డళ్లతో తీవ్రంగా గాయపరిచారు. అయినా వెనక్కి తగ్గని ఆమె రక్తపు గాయాలతోనే బూత్‌లో కూర్చొని వైసీపీ రిగ్గింగ్‌ను అడ్డుకున్నారు. మాచర్లలో ఎమ్మెల్యేగా బ్రహ్మారెడ్డి గెలవాలి, రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని పట్టుదలగా నిలిచారు. పోలింగ్ అనంతరమే ఆమె ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకున్నారు. పార్టీ కోసం ఆమె అకుంఠిత దీక్ష, పట్టుదలను చంద్రబాబు గుర్తించి పదవి కట్టబెట్టారు.

పదవులు ఇలా..

- ఉండవల్లి శ్రీదేవి ఏపీ మాదిగ వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్
- దేగల ప్రభాకర్ ఏపీ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్
- మన్నవ మోహనకృష్ణ ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ చైర్మన్
- చిల్లపల్లి శ్రీనివాసరావు ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్
- మంజులారెడ్డి ఏపీ శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ చైర్మన్
- గోనుగుంట్ల కోటేశ్వరరావు ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్
- చిలకలపూడి పాపారావు ఏపీ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్
- సజ్జా హేమలత ఏపీ హ్యాండ్‌లూమ్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్
- సలగల రాజశేఖర్‌బాబు బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(బాపుడా) చైర్మన్



మన్నవ మోహనకృష్ణ దేగల ప్రభాకర్ చిల్లపల్లి శ్రీనివాసరావు సలగల రాజశేఖరబాబు గోనుగుంట్ల కోటేశ్వరరావు

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

- మూడు జిల్లాల నుంచి పలువురు ఎంపిక
- ఈ నెల 11న విజయవాడలో అవార్డుల పంపిణీ

గుంటూరు(విద్య), నవంబరు 9: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు ఎంపికయ్యారు. ఈ నెల 11న విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో అవార్డులు పంపిణీ చేయనున్నారు.

● **పాఠశాల విభాగంలో** : బాపట్ల జిల్లా నుంచి కోట వెంకటశ్రీనివాసరావు(హెచ్‌ఎం జడ్పీహెచ్‌ఎస్, చక్రాయపాలెం, అద్దంకి మండలం), గోనేళ్ళ శేషవరలక్ష్మి(స్కూల్ అసిస్టెంట్ జడ్పీహెచ్‌ఎస్ ఈపూరుపాలెం చీరాల), పవని భానుచంద్రమూర్తి(ఏఆర్‌ఎం హైస్కూల్ పేరాల, చీరాల మండలం), కర్పూరపు బిజిలికుమార్ (ఎంపీపీఎస్, బలుసులపాలెం, చెరుకుపల్లి), గుంటూరు జిల్లా నుంచి డాక్టర్ చెన్నంశెట్టి రమేష్(ఎంపీయూపీ స్కూల్, మామిళ్ళపల్లి, పొన్నూరు), పెనుమూడి ముత్యం జయరావు(ఎంపీపీఎస్, కొల్లిపర)

● **ఇంటర్ విద్యలో**: బీ సౌజన్య (ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల గుంటూరు), ఆర్‌వీఎస్ ప్రసాద్ (ప్రభుత్వ జూనియర్ కళాశాల దుర్గి), ఎస్ శేషుకుమారి (ప్రిన్సిపల్, ప్రభుత్వ జూ నియర్ కళాశాల ప ర్చూ రు).

● **టెక్నికల్ ఎడ్యుకేషన్ విభాగంలో**: పీ నీలిమ (ఎంటీటీఎస్ పాలిటెక్నిక్‌కళాశాల గుంటూరు)

● **ఉన్నత విద్యావిభాగం**: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య ఎన్‌వీ కృష్ణారావు, ఆచార్య ఎం తిరుపతిరావు, ఆచార్య అశోక్‌కుమార్, ఆచార్య పూర్ణచంద్రరరావు, డాక్టర్ పద్మజరావు, ఆచార్య డీ రామచంద్రన్, డాక్టర్ బిల్‌క్యూస్, డాక్టర్ ఎస్ విష్ణువర్ధన్, డాక్టర్ జీ మోహన్‌నాయుడు



పవని భానుచంద్రమూర్తి (పేరాల) గోనేళ్ళశేషవరలక్ష్మీ (ఈపూరుపాలెం) డాక్టర్ చెన్నంశెట్టి రమేష్ (మామిళ్ళపల్లి)

"రన్‌వేలు అవసరం లేదు.. విమానాశ్రయాలు అంతకంటే అవసరం లేదు.. నీరుంటే చాలు.. నేరుగా ల్యాండ్ అయిపోతుంది.. టేకాఫ్ అవుతుంది.. ఒక జెట్టీ, వాటర్ డ్రోమ్ ఉంటే చాలు.. రివ్వున ఆకాశంలోకి ఎగిరిపోయి.. అంతే వేగంగా కిందకు దిగిపోతుంది.. పర్యాటకులను అమితంగా ఆకట్టుకునే ఈ సరికొత్త సీప్లేన్ ట్రయల్ రన్ శనివారం అద్భుతంగా జరిగింది. పున్నమిఘాట్ వేదికగా, సుందరమైన కృష్ణాతీరంలో, ప్రకృతి అందాల నడుమ అటూ ఇటూ తిరిగిన ప్లేన్ విన్యాసాలను పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు. పర్యాటకంపై సీఎం చంద్రబాబు ప్రసంగం, సప్తవర్ణాలను విరజిమ్మిన బాణసంచా పేలుళ్లు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి."

గఘన యానం

- విజయవాడ-శ్రీశైలం సీప్లేన్ ట్రయల్ రన్ సక్సెస్
- పున్నమిఘాట్ వేదికగా అద్భుత విన్యాసాలు
- ట్రయల్ రన్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ప్రకాశం బ్యారేజీ, పులిచింతల, సాగర్ నుంచి శ్రీశైలం వరకూ..
- సీఎం, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరుల ప్రయాణం
- ట్రయల్ రన్‌కు భారీగా తరలివచ్చిన పర్యాటకులు
- ప్రత్యేక ఆకర్షణగా రెయిన్‌బో రంగుల వెలుగులు



అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

పున్నమిఘాట్ వద్ద కృష్ణాతీరంలో శనివారం సీప్లేన్ ట్రయల్ రన్ అద్భుతంగా జరిగింది. ఘాట్‌లోని వాటర్ జెట్టీ వద్ద ఉదయం 10.05 గంటలకు సీప్లేన్‌ను నిలిపి ఉంచి, జెట్టీ వెనుక భాగంలో అధికారిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, బీసీ జనార్దనరెడ్డితో పాటు ఎంపీ కేశినేని చిన్ని, స్పైస్‌జెట్ సీఎండీ అజయ్‌సింగ్, ఐఅండ్ఐ రాష్ట్ర, కేంద్ర అధికారులు ప్రసంగించారు. ఈ కార్యక్రమం అయిపోగానే, సందర్శకులు వీక్షించేలా టెంట్ తెరలు తొలగించారు. సరిగ్గా 12.45 గంటలకు సీప్లేన్ సర్వీసు కృష్ణానది నుంచి బయల్దేరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఇతర ఆహ్వానితులు ప్లేన్‌లోకి ఎక్కారు. ప్లేన్‌లోకి ఎక్కేముందు చంద్రబాబు అభివాదం చేయటంతో ప్రజలు హర్షధ్వానాలు చేశారు.

గ్రాండ్ వెల్కమ్

సీప్లేన్ డెమో లాంచ్‌కు భారీ ఏర్పాట్లు చేశారు. ప్రారంభ సూచికగా భవానీ ద్వీపం సమీపంలో కృష్ణానదిపై గ్రాండ్ ఫైర్‌వర్క్స్ జరిపారు. పడవలపై పెద్ద ఎత్తున ధ్వనిచేస్తూ సప్తవర్ణాలను ఆకాశంలోకి విరజిమ్మారు.



సీప్లేన్ సాగిందిలా..

కృష్ణానదిలో తూర్పు వైపునకు కదిలిన సీప్లేన్, ఆ వెంటనే యూటర్న్ తీసుకుని భవానీ ద్వీపం చెంతకు వెళ్లింది. ద్వీపం టవర్ సమీపంగా వెళ్లి, అక్కడి నుంచి వాయువేగంతో ముందుకు దూసుకెళ్లింది. ప్రకాశం బ్యారేజీతో పాటు నాగార్జున సాగర్, పులిచింతల డ్యామ్‌ల మీదుగా శ్రీశైలం డ్యామ్ వరకు ఈ సీప్లేన్ వెళ్లింది.



శ్రీబగళాముఖి అమ్మవారిని దర్శించుకున్న జడ్జి



రైల్వే జడ్జి రమాదేవి కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటం బహూకరణ

పిట్టలవానిపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పిట్టలవానిపాలెం మండలం, చందోలు గ్రామంలోని శ్రీబగళాముఖి అమ్మవారిని స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫర్ రైల్వే పి.రమాదేవి తన కుటుంబ సభ్యులతో శనివారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.నాగేశ్వరరావు ఆలయ మర్యాదలు, పూర్ణాకుంభంతో వారికి ఘనస్వాగతం పలికారు. ఆలయ అర్చకులతో వేద ఆశీర్వచనాలు అందజేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అమ్మవారి చిత్రపటాలను బహూకరించి దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జడ్జి పి.రమాదేవి శ్రీబగళాముఖి ఆలయంలో ఆధ్యాత్మిక మాస పత్రిక, ఆరాధన పుస్తకాన్ని ఉచితంగా భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఏఎన్‌యూ ప్రవేశ పరీక్ష

పెదకాకాని, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికిగానూ రెండేళ్ల మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సుల్లో ప్రవేశ పరీక్ష శనివారం సజావుగా జరిగినట్లు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, దూర విద్య కేంద్ర పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తోపాటు ఆదిత్య డిగ్రీ కాలేజి (కాకినాడ), ఎంఎస్ఆర్ఎస్ సిద్ధార్థ డిగ్రీ కాలేజి (విశాఖపట్నం), గీతం డిగ్రీ కాలేజి (ఒంగోలు), గేట్ డిగ్రీ కాలేజి (తిరుపతి), శ్రీ విజయ దుర్గ డిగ్రీ కాలేజి (కర్నూలు), శ్రీసాయి డిగ్రీ కాలేజి (అనంతపూర్) ల్లో పరీక్ష జరిగిందన్నారు. ఆదివారం సాయంత్రం ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల చేస్తామన్నారు. అర్హత సాధించిన అభ్యర్థులు ఈనెల 15వ తేదీలోగా ఆయా కోర్సుల్లో ప్రవేశాలు పొందాలని సూచించారు.

గూడ్స్ రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

తెనాలి క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెనాలి-ఒంగోలు ప్రధాన రైలు మార్గంలో నిడుబ్రోలు-మోదుకూరు స్టేషన్ల మధ్య గుర్తుతెలియని యువకుడు గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడని తెనాలి జీఆర్‌పీ ఎస్సై జి.వెంకటాద్రి శనివారం తెలిపారు. గుర్తుతెలియని 30 సంవత్సరాల యువకుడు ఒక్కసారిగా గూడ్స్‌కు ఎదురు వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం గుర్తించిన లోకో పైలెట్ వెంటనే తెనాలి రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్‌కు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా బిస్కెట్ కలర్ ప్యాంట్, గళ్ల చొక్కా ధరించిన యువకుడు మృతి చెంది ఉన్నాడు. మృతదేహం వద్ద పగిలిపోయి ఉన్న సెల్‌ఫోన్ ఉంది. ఇతర వ్యక్తిగత సమాచారం లభించకపోవడంతో కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సర్కిల్స్ విభజన.. మారిన స్వరూపాలు

- గతంలో ఉమ్మడి జిల్లా అంతా సర్కిల్‌గా ప్రాధాన్యం
- ప్రస్తుతం రెండు, మూడు డివిజన్‌లకే పరిమితం

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (సీపీ డీసీఎల్) పరిధిలోని ఉమ్మడి గుంటూరు జిల్లాలో సర్కిల్స్ విభజన ప్రక్రియతో స్వరూపాలు ఒక్కసారిగా మారిపోయాయి. గతంలో విద్యుత్ గుంటూరు సర్కిల్ స్థాయి చెప్పుకోవాలంటే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఐదు డివిజన్‌లతో విస్తరించి ఉండేది. ఇప్పుడు కేవలం రెండు డివిజన్‌లకే పరిమితమైపోవటంతో సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ ప్రాధాన్యం కూడా తగ్గింది. సర్కిల్స్ విభజన ప్రక్రియ ప్రస్తుతం ఆ శాఖ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గుంటూరు సర్కిల్ స్థాయి గుంటూరు టౌన్-1, తెనాలి డివిజన్‌లు కలుపుకొని కొత్త సర్కిల్‌గా ఏర్పాటు చేశారు. అలానే రాజధాని అమరావతి కేంద్రంగా కొనసాగుతున్న సీఆర్‌డీఏ సర్కిల్ గతంలో మాదిరిగానే గుంటూరు-2 డివిజన్, అమరావతి డివిజన్‌లతో అదే పరిధిలో ఉంది. ఇక కొత్తగా ఏర్పాటైన పల్నాడు సర్కిల్ రెండు డివిజన్‌లు కాగా బాపట్ల సర్కిల్ కూడా రెండు డివిజన్‌లకే పరిమితమయ్యాయి. నరసరావుపేట కేంద్రంగా ఏర్పాటు చేసిన పల్నాడు సర్కిల్ పరిధిలో నరసరావుపేట, మాచర్ల డివిజన్‌లు కలిపారు. కొత్తగా ఏర్పాటైన బాపట్ల జిల్లా కేంద్రంగా ఉన్న బాపట్ల సర్కిల్ పరిధిలో బాపట్ల, చీరాల, అద్దంకి డివిజన్‌లు కలిసి సర్కిల్‌గా ప్రకటించారు. ఫలితంగా సర్కిల్స్ ప్రాధాన్యం తగ్గిపోయింది.

తగ్గిన గుంటూరు సర్కిల్ ప్రాధాన్యం

సీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్ గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా విస్తరించి ఉండేది. సర్కిల్ పరిధిలో గుంటూరు టౌన్-1, తెనాలి, నరసరావుపేట, మాచర్ల, బాపట్ల డివిజన్‌లతో మొత్తం ఐదు డివిజన్‌లతో ప్రత్యేక ప్రాధాన్యత ఉండేది. సర్కిల్ ఎస్ఈ స్థాయి కూడా ఐదు డివిజన్‌లను పర్యవేక్షించటం, జిల్లా స్థాయిలో అధికారులతో సమీక్షలు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులతో కీలకంగా వ్యవహరించేవారు. అటువంటిది ప్రస్తుత విభజనతో ఉమ్మడి జిల్లా గుంటూరు, సీఆర్‌డీఏ, బాపట్ల, పల్నాడు సర్కిల్స్‌గా రూపాంతరం చెందటంతో ఆపరేషన్ ఎస్ఈల ప్రాధాన్యత తగ్గినట్లయింది. అయితే విభజన ప్రక్రియ పూర్తి చేసిన అధికార యంత్రాంగం ఆ స్థాయిలో సిబ్బంది నియామకాలు లేవని సిబ్బంది అంతర్గతంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బందిపై అదనపు భారం పడుతోందని వాపోతున్నారు.

బెల్టు షాపు పెట్టినా.. ఎమ్మార్పీ ఉల్లంఘించినా..

- కఠిన చర్యలు తప్పవు
- నాటు సారా తయారీ పై ఉక్కుపాదం
- ఎన్‌డీపీ లిక్కర్ అమ్మితే పీడీ యాక్ట్
- గుంటూరు ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ డాక్టర్ శ్రీనివాసులు, పక్కన ఏసీ రవి కుమార్ రెడ్డి

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మద్యం వ్యాపారులు వారి షాపుల పరిధిలో బెల్టుషాపు పెట్టినా, షాపుల్లో మద్యం అమ్మకాల్లో ఎమ్మార్పీ ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. గుంటూరులో విలేకరులతో మాట్లాడుతూ నాటుసారా తయారీపై ఉక్కు పాదం మోపుతున్నామని, ఎన్‌డీపీ లిక్కర్ అమ్మితే పీడీ యాక్ట్ పెడతామని ఆయన తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. బెల్టు షాప్ నిర్వహిస్తూ పట్టుపడితే మొదటిసారి లక్ష రూపాయలు జరిమానా, బైండోవర్ కేసులు పెడతామన్నారు. రెండో పర్యాయం పట్టుపడితే రూ.5 లక్షల జరిమానా, షాపు లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. అదేవిధంగా మద్యం అమ్మకాల్లో ఎమ్మార్పీ ఉల్లంఘిస్తే మొదటిసారి రూ. 5 లక్షల జరిమానా, రెండోసారి షాపు లైసెన్స్ రద్దు చేస్తామని చెప్పారు. ఎస్‌టీఎఫ్, జిల్లా టాస్క్‌ఫోర్స్ విస్తృతంగా తనిఖీలు చేస్తుంటారని, డెకమ్ ఆపరేషన్ ద్వారా నిరంతరం నిఘా ఉంటుందన్నారు. నాటు సారా తయారు చేసినా, అమ్మినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పల్నాడు జిల్లాలో నరసరావుపేట, బొల్లాపల్లి, మాచర్ల బోర్డర్ ప్రాంతాల్లో నాటు సారా తయారవుతున్నట్లు సమాచారం ఉందన్నారు. క్షేత్రస్థాయిలో దాడులు చేపడతామన్నారు. పల్నాడు జిల్లాను నాటు సారా జిల్లాగా ప్రకటించేలా చేస్తామన్నారు. టీంలు ఏర్పాటు చేసి దాడులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. పోలీసులు, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులతో పాటు ఇతర అధికారులు కూడా భాగస్వాములు చేసి అవగాహన శిబిరాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఎన్‌డీపీ లిక్కర్ ఇతర రాష్ట్రాల నుంచి మన జిల్లాలోకి వస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. రాష్ట్ర సరిహద్దులైన తెలంగాణ, కర్ణాటక, గోవా, చెన్నై నుంచి ఎన్‌డీపీ లిక్కర్ వస్తుందని, దీనిని నివారించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఎన్‌డీపీ లిక్కర్ అమ్మిన వారిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రవి కుమార్ రెడ్డి, ఈఎస్‌లు అరుణ కుమారి (గుంటూరు), మణికంఠ (నరసరావుపేట), ఏఈఎస్‌లు మారయ్య బాబు, రవీంద్ర, పల్నాడు, గుంటూరు జిల్లాల సిఐలు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి



సమావేశంలో కొమ్మాలపాటి శ్రీధర్, ఏడు నియోజకవర్గాల పరిశీలకులు

నరసరావుపేట టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. శనివారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏడు నియోజకవర్గాల పరిశీలకులు, ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ నియోజకవర్గ ద్వితీయ శ్రేణి నాయకులతో సమన్వయం చేసుకొని సభ్యత్వం వేగవంతం చేసి జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉందంటే ఒక ధైర్యం, భరోసా ఉంటుందన్నారు. ఇప్పటికి 70 లక్షల సభ్యత్వంతో టీడీపీ దేశంలో బలంగా క్యాడర్, కార్యకర్తలు కలిగిన పార్టీగా ఎదిగిందన్నారు. యువనేత నారా లోకేశ్ సరికొత్తగా ఆలోచించి బీమా పథకాన్ని ప్రవేశ పెట్టారాన్నారు. చనిపోయిన ప్రతి ఒక్కరికి గతంలో రూ.2 లక్షలు చెల్లించేవారని, అయితే దానిని రూ.5 లక్షలకు పెంచడం ఒక భరోసాగా చెప్పవచ్చు అన్నారు. అంతేగాక మట్టి ఖర్చులకు రూ. 10 వేలు తక్షణ సహాయం కూడా అందిస్తున్నారని అన్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి సభ్యత్వ నమోదు, పార్టీ సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. గత ఐదేళ్ల పాలన ప్రజా వ్యతిరేకంగా సాగిందన్నారు. అందుకనే ప్రజలు ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేశారని, కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. పార్టీ సభ్యత్వ నమోదులో భాగంగా ప్రతి క్రియాశీలక సభ్యుడికి ప్రమాద బీమా వర్తింపజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, రాష్ట్ర నాయకులు ఎం.ధారునాయక్, నల్లపాటి రామచంద్ర ప్రసాదు, తాత జయప్రకాష్ నారాయణ, దాసరి ఉషారాణి, కళ్ళం రాజశేఖర్‌రెడ్డి, వేల్పుల సింహాద్రి యాదవ్, నాగోతు శౌరయ్య, కడియాల వెంకటేశ్వరరావు, వల్లెపు నాగేశ్వరరావు, గొట్టిపాటి జనార్దన్‌బాబు, కొట్టా కిరణ్, దాసరి ఉదయ్‌శ్రీ, కనుమూరి లక్ష్మి, కోసూర రాధిక తదితరులు పాల్గొన్నారు.

నేడు అటవీ అమరవీరుల సంస్మరణ దినం

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అటవీ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్డులోని అరణ్య భవన్‌లో నిర్వహించాలని అటవీ శాఖ నిర్ణయించింది. ఉదయం 10.30 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందని అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి ఆ డిపార్టుమెంట్ జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరయ్యే అవకాశం ఉన్నట్లుగా పేర్కొన్నారు.

ఇటుకల కింద పడి వ్యక్తి మృతి

పెదకాకాని, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటుకల లారీ పంక్చర్ కావడంతో బోల్తా కొట్టిన ఘటనలో ఇటుకలు మీద పడి దానిపై ఉన్న వ్యక్తి మృతి చెందినట్లు శనివారం పెదకాకాని పోలీసులు తెలిపారు. మృతుడిది తాడేపల్లిగూడెంగా పోలీసులు గుర్తించారు. తాడేపల్లిగూడెం నుంచి గుంటూరుకు ఇటుకలు సరఫరా చేస్తున్న లారీ మార్గమధ్యంలోని నాగార్జున విశ్వవిద్యాలయ ఎదుట పంక్చర్ అయింది. దీంతో అదుపుతప్పి బోల్తా కొట్టింది. లారీ పైనున్న తాడేపల్లికు చెందిన సత్యనారాయణ(53) అనే వ్యక్తి కింద పడగా, అతనిపై ఇటుకలు పడి అక్కడికక్కడే మృతి చెందాడు.

నైట్‌షెల్టర్లు.. నామమాత్రమే

(5 పేజీ తరువాయి)

స్నానం తదితరాలు లేక, దుస్తులు శుభ్రం చేసుకునే పరిస్థితి లేక మురికిగా కాలం వెళ్లదీస్తుంటారు.

- గుంటూరులోని అరండల్‌పేట, ఆర్టీసీ బస్టాండ్ ఎదుట, పట్టాభిపురంలో మూడు ప్రాంతాల్లో నైట్‌షెల్టర్లు ఉన్నాయి. అయితే నిర్వహణ సక్రమంగా లేక ఇవన్నీ అపరిశుభ్రతతో అధ్వానంగా ఉన్నాయి. ఒక్కొక్క సెంటర్‌ను ఒక్కో స్వచ్ఛంద సంస్థకు అప్పగించినా వాటిని నిర్వహించలేక బాధ్యతల నుంచి ఆయా సంస్థలు వైదొలిగాయి. గత ఐదేళ్ల ఈ కేంద్రాల గురించి ప్రభుత్వం పట్టించుకోలేదు. రాత్రి వేళల్లో ఆశ్రయం కోసం వచ్చే నిరాశ్రయులకు కనీస సౌకర్యాలు ఇక్కడ ఉండటంలేదు. ఉండటానికి పెద్ద పెద్ద గదులున్నా సరైన బెడ్స్, ఫ్యాన్లు, విద్యుత్ సౌకర్యం లేదు. దీంతో ఇక్కడకు వచ్చేందుకు నిరాశ్రయులు, అభాగ్యులు ఆసక్తి చూపడంలేదు. అరండల్‌పేట ఒకటో లైన్‌లోని నైట్‌షెల్టర్ పరిసరాలు తీవ్రమైన దుర్వాసనతో నిండి ఉంది. కొన్ని రోజులుగా ఈ సెంటర్ తాళాలు కూడా తీయడంలేదని సమాచారం. బస్టాండ్ వద్ద ఉన్న కేంద్రానికి విద్యుత్ సరఫరా లేక అరకొర వచ్చే వారు కూడా దోమల బాధ తట్టుకోలేక వెళ్తున్నారు. పట్టాభిపురంలోని సెంటర్లో అయితే ఇద్దరు ముగ్గురు కూడా లేరు. దీంతో జీజీహెచ్ వద్ద అయితే రాత్రిళ్లే కాక పగలు కూడా వందల సంఖ్యలో ఉంటుంటారు. ఎవరైనా ఆహారం తెచ్చి పెడితే తిని అక్కడే ఎండకు, వానకు, చలికి అల్లాడుతుంటారు.
- తెనాలిలో బాలాజీరావుపేటలో గతంలో ఏర్పాటు చేసిన నైట్‌షెల్టర్ వైసీపీ హయాంలో మూతపడింది. నందులపేటలోని నైట్‌షెల్టర్‌లో సుమారు 40 మంది ఆశ్రయం పొందుతున్నారు. ఈ కేంద్రాల గురించి తెలియక పెద్దసంఖ్యలో అభాగ్యులు రోడ్లపై ఆశ్రయం పొందుతున్నారు.
- పొన్నూరులో దశాబ్దాలుగా నైట్‌షెల్టర్లు ఏర్పాటు చేయలేదు. దీంతో బిచ్చగాళ్లు, ఏ ఆశ్రయం లేని వారు పట్టణ పరిధిలోని రోడ్లు, ఫుట్‌పాత్‌లు, రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంలపై జీవనం సాగిస్తున్నారు. ఓవర్‌బ్రిడ్జి, రైల్వేప్లాట్‌ఫాంలపై 35 మంది వరకు రాత్రి వేళ సేదతీరుతున్నారు.
- నరసరావుపేటలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించే నిరాశ్రయుల వసతి గృహాల నిర్వహణకు నిధుల కొరత నెలకొంది. గుంటూరురోడ్డులోని వసతిగృహాన్ని మూసేశారు. రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న మరో వసతి గృహంలో 25 మంది మహిళలు ఉంటున్నారు. అయితే ఆరు నెలలుగా నిధులు విడుదల కాలేదని నిర్వాహకులు తెలిపారు.
- పిడుగురాళ్లలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నైట్‌షెల్టర్ కొన్నేళ్లుగా ఉంది. ఇక్కడ సౌకర్యాలు అరకొరగానే ఉన్నాయి. అయితే అక్కడ ఉండేవారికన్నా రోడ్ల మార్జిన్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఉండే అభాగ్యులే అధికం.
- వినుకొండలో ఐదేళ్లుగా నిరాశ్రయులకు వసతిగృహం కొనసాగుతుంది. దాతల సాయంతో దుప్పట్లు పంపిణీ చేశారు. అయితే ఇక్కడ అందరికీ కాకుండా కొందరికే ఆశ్రయం కల్పిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. 30 మందికి అవకాశం ఉన్నా కేవలం 14 మందికి మాత్రమే ఆశ్రయం కల్పిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ వివరణ కోరగా ఆశ్రమానికి మున్సిపాలిటికి ఎటువంటి సంబంధంలేదన్నారు.
- చిలకలూరిపేటలో ప్రస్తుతం ఎటువంటి నైట్‌షెల్టర్లు లేవు. కొన్నేళ్ల క్రితం ఏఎంజీ సంస్థ కుమ్మరికాలనీలో నైట్‌షెల్టర్ ఏర్పాటు చేసింది. అయితే దీనిని ఉపయోగించుకునే వారు లేకపోవడంతో మూసివేశారు.
- మాచర్లలోని రామాటాకీస్‌లైన్‌లో స్వశక్తి రూరల్ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో నైట్‌షెల్టర్ ఉంది. అయితే దీని గురించి నిరాశ్రయులకు సమాచారం లేదు. ఇక్కడ ఐదుగురికే ఆశ్రయం పొందే అవకాశం ఉంది.
- బాపట్లలోని రైలుపేటలో మెప్మా పర్యవేక్షణలో ఐదేళ్లుగా ఉన్న నైట్‌షెల్టర్‌లో 15 మంది ఉండటానికి అవకాశం ఉంది. అయితే 15 మందికి ఒకే మరుగుదొడ్డితో ఇబ్బందికరంగా ఉంది. ఇక్కడ మరో మూడు మరుగుదొడ్లు నిర్మించాలని మున్సిపల్ కమిషనర్‌కు అర్జీలు కూడా అందజేశారు. నిర్వాహకులకు ఏడాది నుంచి బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారు.
- రేపల్లెలోని ఐదో వార్డులోని నైట్‌షెల్టర్‌లో నామమాత్రపు వసతులు ఉండటంతో బసకు ఎక్కువ మంది రావడంలేదు. గతంలో 40 మందిపైనే ఉండేవారు, ఇప్పుడు 16 మంది మాత్రమే ఉంటున్నారు. దాతల సహకారంతో భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీరు, సరిపడా మరుగుదొడ్లు లేవు. ఈ సమస్యలపై ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవని నిర్వాహకులు ఆరోపిస్తున్నారు.

భార్యను పుట్టింటి వారు తీసుకెళ్లారని..
యువకుడి ఆత్మాహత్యాయత్నం

- సెల్ టవర్ ఎక్కి ఐదు గంటల పాటు హల్ చల్



సెల్ టవర్ ఎక్కిన యువకుడు

క్రోసూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భార్యను పుట్టింటి వారు బలవంతంగా తీసుకు వెళ్లారని, ఆమెను పంపించకపోతే ఆత్మహత్య చేసుకుంటానని క్రోసూరుకు చెందిన మస్తాన్‌వలి శనివారం సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో క్రోసూరు నడిబొడ్డున ఉన్న బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ పైకి ఎక్కి అక్కడి నుంచి దూకుతానని, తన భార్యను తనకు చూపించే వరకు దిగేది లేదని భీష్మించుకొని కూర్చున్నాడు. పోలీసులు, ఫైర్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. యువకుడిని దిగి రావాలని క్రోసూరు ఎస్ఐ నాగేంద్రరావు పలు మార్లు ఫోన్‌లో కోరారు. వివరాలు ఇలా ఉన్నాయి. క్రోసూరుకు చెందిన షేక్ మస్తాన్‌వలి(23), మేడికొండూరు మండలం సిరిపురం గ్రామానికి చెందిన షేక్ దిల్షాద్(19) కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో అమ్మాయి తరుపు వారు వీరి ప్రేమకు, వివాహానికి అడ్డు చెబుతూ వస్తున్నారు. మస్తాన్‌వలి దిల్షాద్‌ను తీసుకొని తూర్పు గోదావరి జిల్లా తణుకు వెళ్లి బుద్ధ అండ్ హెజ్ ధర్మ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన వివాహం చేసుకున్నాడు. వివాహానికి సంబంధించి ఆ సంస్థ వారు ధ్రువీకరణ పత్రం కూడా ఇచ్చారు. దిల్షాద్‌ను తీసుకొని క్రోసూరు వచ్చిన మస్తాన్‌వలి తమ సంప్రదాయం ప్రకారం ఈనెల 7వ తేదీన క్రోసూరులో ఆమెను మళ్లీ వివాహం చేసుకోవటానికి పూనుకున్నాడు. విషయం తెలుసుకున్న అమ్మాయి తరుపు వారు సిరిపురం గ్రామం నుంచి వచ్చి అమ్మాయిని తీసుకు వెళ్లారు. వెంటనే మస్తాన్‌వలి తన భార్యను పుట్టింటి వారు బలవంతంగా తీసుకు వెళ్లారని క్రోసూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ అనంతరం పోలీసులు కేసు నమోదు చేశారు. అమ్మాయిని తీసుకు రావటంలో పోలీసులు తాత్సారం చేస్తున్నారని ఆరోపిస్తూ యువకుడు మస్తాన్‌వలి సెల్ టవర్ పైకి ఎక్కి అమ్మాయిని పంపించక పోతే దూకి చనిపోతానని చేశాడు. సిరిపురం నుంచి దిల్షాద్‌ను తీసుకొని వచ్చిన పోలీసులు అతనికి చూపించటంతో సెల్ టవర్ దిగి వచ్చాడు.

జపాన్ సకురా సైన్స్ ప్రాజెక్టుకు విజ్ఞాన్ అధ్యాపకులు ఎంపిక



ఎంపికైన అధ్యాపకులతో వీసీ ఆచార్య నాగభూషణ్

గుంటూరు(విద్య), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయానికి చెందిన ఇద్దరు అధ్యాపకులు జపాన్‌లోని సకురా సైన్స్ ప్రాజెక్టు 2024కు ఎంపికయ్యారని వీసీ ఆచార్య పి.నాగభూషణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలోని బయోటెక్నాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ఎస్ సంపత్‌కుమార్, డాక్టర్ చింతగుంట అంజనీదేవి టోక్యోలో ఏడు రోజుల పాటు సైన్స్ ప్రాజెక్టులో పాల్గొంటారని తెలిపారు. యూనివర్సిటీ ఆఫ్ మియజాకీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే సకురా ప్రాజెక్టులో పాల్గొంటారని తెలిపారు. భారతదేశం నుంచి కేవలం 12 మంది ఎంపిక కాగా వారిలో ఇద్దరు విజ్ఞాన్ విశ్వవిద్యాలయానికి చెందిన వారు ఉన్నారని తెలిపారు. అధ్యాపకుల్ని రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వివిధ విభాగాల డీన్లు అభినందించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123, 132, 142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 350 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 12వే క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతున్నాయి.

ఆర్యవైశ్యులకు పెద్దపీట

గురజాలటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్ద పీట వేశారని టీడీపీ మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల్లో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా డుండి రాకేష్‌ను ప్రకటించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

అచ్చంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోనూరు గ్రామంలో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేసినట్లు అచ్చంపేట మండల టీడీపీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం తెలిపారు. శనివారం కోనూరులోని ఎస్సీ బీసీ కాలనీల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో ఆశీర్వాదంతో పాటు బూత్ కన్వీనర్ నందిగం నాగరాజు, చింతపల్లి శ్రీనివాసరావు, కొమ్మవరపు ఏసుపాదం, బయ్యవరపు రోశయ్య, ఆదాం, నాగయ్య పాల్గొన్నారు.

సదాశివం నియామకం హర్షణీయం

దాచేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏపీ నాయీబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా తిరుపతికి చెందిన ఆర్ సదాశివం నియామకం హర్షించదగ్గ విషయమని సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు దాచేపల్లి మండల నాయీబ్రాహ్మణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గుంటుపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. బడుగు బలహీనవర్గాలకు కూటమి ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తుందని తెలిపారు.

సైకిల్ స్టాండ్ నిర్మాణానికి

పూర్వ విద్యార్థుల సాయం

రెంటచింతల,నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తుమ్మకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 50 ఏళ్ల కిందట విద్యనభ్యసించిన వారంతా పాఠశాలలో సైకిల్ స్టాండ్ నిర్మాణానికి రూ.1.70 లక్షలను విరాళంగా అందజేశారు. సోమవారం రోజున పాఠశాల పూర్వ హెచ్‌ఎం అక్కిరాజు సచ్చిదానందరావు 101వ జయంతిని పురస్కరించుకుని సైకిల్ స్టాండ్‌ని ప్రారంభిస్తామని వారు తెలిపారు.

వైద్యశిబిరం విజయవంతం

పిడుగురాళ్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణ ముస్లిం మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జడ్పీ పాఠశాలలో మైసూరు ఫ్రీ మెడికల్ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గుండె జబ్బుల వైద్యశిబిరాన్ని పట్టణ సీఐ కే. వెంకట్రావు ప్రారంభించారు. డాక్టర్ హారమ్ రషీద్ 132 మందికి గుండె పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పాండురంగ శ్రీను, బాబావలి, అమీర్‌అలి, భాషా, మస్తాన్‌వలి, సైదా, ఫరీద్ మేస్త్రి, ముజీబ్, వాచర్‌బుడే, ఆర్‌ఎంపిలు వలి, సర్దార్, ఇంతియాజ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

పెదకూరపాడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని 75 తాళ్ళూరు పీహెచ్‌సీ, పెదకూరపాడులోని సీహెచ్‌సీ ప్రభుత్వ ఆస్పత్రుల్లోని గర్భిణులకు మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కొండవీటి ప్రసాదు, వైద్యులు కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

దాచేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలోని పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ వై కుటుంబరావు సిబ్బందితో కలిసి పరిశీలించారు. శనివారం నారాయణపురంలోని 81 నుండి 84, దాచేపల్లి రూరల్‌లోని గామాలపాడు పోలింగ్ కేంద్రంలోని 92 నుండి 97 వరకు వున్న పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం నూతన ఓటర్ల నమోదుపై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రికార్డులను పరిశీలించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

దాచేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రంగవల్లి 25వ వర్ధంతి సందర్భంగా దాచేపల్లిలో రైతుకూలీ సంఘం ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు, పల్నాడు జిల్లా అధ్యక్షులు మోమిన్ సైదయ్య అధ్యక్షతన పోస్టర్లను ఆవిష్కరించారు. రంగవల్లి అక్క దేవాలయ, ధర్మాదాయ భూములను నిరుపేదలకు పంపిణీ చేశారన్నారు. వేములవాడలో నవంబరు 11న రంగవల్లి విజ్ఞాన కేంద్రంను ప్రారంభిస్తారని వివరించారు. కార్యక్రమంలో జక్కుల రమేష్, పొట్టిసిరి చినశంకరరావు, పుట్టా కొండలు, మాతంగి రాంబాబు, పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం

బెల్లంకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని టీడీపీ బెల్లంకొండ మండల అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో సభ్యత్వాన్ని వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజక వర్గంలో కెల్లా సభ్యత్వ నమోదులో బెల్లంకొండ మండలం ముందుండాలని సూచించారు. సమావేశంలో టీడీపీ నేతలు ఓర్సు ఆనంద్, వెన్నా సీతారామిరెడ్డి, గుడిసె కొండయ్య, ఆసుల జగన్, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, పీఎస్‌కే రసూల్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వ స్ఫూర్తికి తూట్లు

- పాఠశాల నిర్మాణానికి దాతలు స్థలం విరాళం
- నాలుగేళ్లు గడిచినా పనులు పూర్తికాని వైనం
- ప్రాథమిక పాఠశాలలోనే హైస్కూలు
- కేవలం నాలుగు గదుల్లోనే బోధన
- అవస్థలు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల విమర్శలు

చాలీచాలని ఇరుకు గదుల్లో చదువులు సాగిస్తున్న ఆ పాఠశాల విద్యార్థుల పరిస్థితిని చూసిన దాతలు చలించిపోయారు. 'ఎవరైనా స్థలాన్ని దానంగా ఇస్తే పాఠశాల గదులు నిర్మిస్తాం' అని అధికారులు కోరగా వెంటనే స్పందించి రూ.లక్షలు విలు వైన స్థలాన్ని విరాళంగా అందజేసి అందరి మన్ననలు అందుకున్నారు. కానీ వారి దాతృత్వ స్ఫూర్తిని నేతలు, అధికారులు అపహాస్యం చేస్తున్నారు. అడిగిందే తడవుగా ఎంతో ఉదారంగా స్థలాన్ని దానంగా ఇస్తే ఇప్పటికీ గదుల నిర్మించింది లేదు. ఈ విషయంలో అధికారుల తీరు 'దేవుడు కరుణించినా పూజారి వరమివ్వని' చందంగా ఉందని స్థానికులు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

నిర్మాణం నిలిచి పోయిన హైస్కూల్ భవనం





దాతల శిలాఫలకం,



క్లాసులో కిక్కిరిసి కూర్చున్న విద్యార్థులు

క్రోసూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండలం హసానాబాద్ జిల్లా పరిషత్ హైస్కూల్ భవన నిర్మాణం నాలుగు సంవత్సరాలుగా అర్ధంతరంగా నిలిచి పోయింది. రూ 1.35 కోట్లతో అంచనా వ్యయంతో 2021 మొదట్లో భవన నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. గ్రామస్థులు ఎవరైనా స్థలాన్ని దానం ఇస్తే పాఠశాలను వెంటనే నిర్మిస్తామని అప్పట్లో అధికారులు కోరగా గ్రామానికి చెందిన మాజీ గ్రామాధికారి చింతలపాటి సోమయ్య, రాజ్యలక్ష్మి జ్ఞాపకార్థం కుమారుడు, హైదరాబాద్‌లో వైద్యవృత్తిలో స్థిరపడిన సూలపాణి, హిమబిందు దంపతులు ముందుకు వచ్చి సుమారు రూ.50 లక్షలు ఖరీదు చేసే ఎకరం 75 సెంట్లు భూమిని పాఠశాల నిర్మాణానికి దానంగా ఇచ్చి వెంటనే రిజిస్టర్ చేశారు. మొదట్లో భవన నిర్మాణ పనులు ప్రారంభం తర్వాత మధ్యలో నిలిచిపోయాయి. దీంతో గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి దాతల దాతృత్వానికి స్ఫూర్తి కొరవడిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చాలీచాలని వసతులతో ఇక్కట్లు..

మరోపక్క ప్రాథమిక పాఠశాలలోని ఒక భాగంలో చాలీచాలని వసతులతో హైస్కూలు విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. హైస్కూల్లో హసానాబాద్, వన్నాయపాలెం గ్రామాలకు చెందిన విద్యార్థులు సుమారు 250 మంది 6వ తరగతి నుంచి 10 తరగతి వరకు చదువుతున్నారు. అరకొర వసతులతో కేవలం నాలుగు గదుల్లో హైస్కూల్ నడుస్తోంది. కేవలం విద్యార్థులకు ఉపాధ్యాయులకు కలిపి రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. అప్పటి వరకు ప్రాథమిక ఉన్నత పాఠశాలగా ఉన్న గ్రామంలోని పాఠశాల 2017 - 18 సంవత్సరంలో హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయింది. ఎనిమిది సంవత్సరాలుగా 10వ తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ వస్తున్నారు.

పాఠశాల నిర్మాణానికి, వసతుల కల్పనకు రూ 1.35 కోట్లు అంచనా వ్యయం కాగా, సుమారు రూ.70 లక్షలు ప్రభుత్వ కాంపోనెంట్‌గా 10 రకాల మెటీరియల్ (ఐఎఫ్‌పీ ప్యానల్స్, ఆర్‌వో ప్లాంట్లు, టాయిలెట్స్ కమోట్స్, కిటికీలు, తలుపులు, పాఠశాలకు కావాల్సిన బెంచీలు, ఎలక్ట్రికల్ వస్తువులు, పైపులైన్‌లు, మొదలైనవి) వాటిలో కొన్నింటినీ సరఫరా చేయగా, ఇవన్నీ నేడు వృథాగా పడివున్నాయి. మిగిలిన రూ.65 లక్షల్లో సుమారు రూ.63 లక్షలు ఇప్పటి వరకు ఖర్చుచేశారు. ప్రస్తుతం పాఠశాల నిర్మాణం గోడలు లేచి స్లాబు కూడా నిర్మాణం జరిగింది. ఒకపక్క బోరు బావి నిర్మించినప్పటికీ దానిలో నీరు సక్రమంగా రావటంలేదు. పాఠశాల నిర్మాణం ఆగిపోవటానికి ఇసుక, సిమెంట్ రేట్లు పెరగటం, ఐరన్ రేటు ఆకాశాన్ని అంటటం, అంచనాలకు మించి నిర్మాణ వ్యయం కావటం కారణంగా అధికారులు చెపుతున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల్లో కేవలం రూ 2 లక్షలు మాత్రమే ఇంకా రావాల్సి ఉంది. ప్రస్తుతం మళ్ళీ నిధులు విడుదలైతే కానీ పాఠశాల నిర్మాణం ముందుకు సాగే అవకాశం లేదు.

పాఠశాలలో గదులు సరి పోవటం లేదు

- జావీద్, అఖిల్ విద్యార్థులు



చదువు కోవటానికి పాఠశాలలోని గదులు సరి పోవటం లేదు. ఇరుక్కొని కూర్చోవాల్సి వస్తోంది. మరుగు దొడ్లకు పోవాలన్నా ఇబ్బందిగా ఉంది. కొత్త గదుల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయండి.

చదువుకి అంతరాయంగా ఉంది

- అపర్ణ, జాస్మిన్, విద్యార్థినులు



ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఒకే భవనంలో ఉండటంతో చదువుకు అంతరాయం కలుగుతుంది. తరగతి గదులు సరి పోక వరండాలో కూర్చుంటున్నాం. సాయంత్రం ఆడుకోవాలన్నా ఇబ్బందిగా ఉంటుంది.

విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు

- కనకారావు ఎస్‌ఎంసీ చైర్మన్



పాఠశాలలో తగిన వసతులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు, ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు ఒక భవనంలో ఉండటంతో చదువులు సాఫీగా సాగటం లేదు.

అకుంఠిత ధైర్యమే అందలమెక్కించింది

● ఏపీ శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్ అండ్ కల్చరల్ చైర్మన్‌గా మంజులరెడ్డి



రెంటచింతల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల పోలింగ్ సందర్భంలో వైసీపీ మూకల గొడ్డలిపోటుని ఎదుర్కొన్నా, వెరవకధైర్యంతో నిలిచిన చేరెడ్డి మంజులరెడ్డిని నేడు పదవి వరించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం నామినేటెడ్ పోస్టులకు పలువురి ఎంపిక చేయగా, రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన చేరెడ్డి మంజుల రెడ్డిని ఏపీ శిల్పా రామం ఆర్ట్స్ క్రాఫ్ట్ అండ్ కల్చరల్ (హస్తకళాభివృద్ధి) సొసైటీ చైర్మన్‌గా ఎంపిక చేశారు.

రాజకీయ కుటుంబం నేపథ్యం నుంచి వచ్చిన మంజుల రెడ్డి ఈ ఏడాది మే 13న నిర్వహించిన ఎన్నికల్లో వీరోచితంగా పోరాడింది. పోలింగ్ బూత్‌లో టీడీపీ తరుపున ఏజెంట్‌గా కూర్చోవడానికి వెళ్తున్న సమయంలో ఆమెపై దాడిజరిగింది. అయినా వెనక్కి తగ్గకపోవడంతో మరోసారి వీధుల్లో గొడ్డలితో దాడిచేశారు. అయినా ఎక్కడా 'తగ్గేదే లేదు..' అన్నట్లుగా రక్తస్రావమౌతున్నా తట్టుకుని నిలబడింది. బ్రహ్మానందరెడ్డిగెలవాలి.. చంద్రబాబు సీఎం కావాలని పెద్దపెట్టున నినాదాలు చేసింది. నాడు పార్టీ, నాయకుడి గెలుపుకోసం ఆమె ప్రదర్శించిన తెగువ, పట్టుదలే నేడు పదవి రావడానికి దోహదపడింది. ఈ సందర్భంగా మంజులరెడ్డి మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కారణమైన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

1983 తర్వాత నామినేటెడ్ పదవి ఇదే ప్రథమం..

1983 జనవరిలో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారి రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి మండలానికి దక్కడం ఇదే ప్రథమం. గతంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి తండ్రి నాగిరెడ్డి ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌గా పనిచేయగా అప్పటి నుంచి ఎవరికి ఆ స్థాయిలో పదవులు రాలేదు. (గురజాల మినహా)ఈమె భర్త చేరెడ్డి కోటిరెడ్డి 2006 నుంచి 2011 వరకు రెంటాల సర్పంచ్‌గా వ్యవహరించారు.

ఇటీవల దీపావళి పండుగ ముందు రోజున సీఎం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరీని కోటిరెడ్డి దంపతులు కలిశారు. భువనేశ్వరీకి మే 13న జరిగిన పరిణామాలన్నింటిని వివరించగా కంటతడితో మంజులను ఓదార్చారు. మహిళని చూడకుండా గొడ్డలితో నరకడాన్ని పార్టీ తీవ్రంగా పరిగణించింది. మీ కష్టాన్ని వృథా కానివ్వమని భువనేశ్వరీ మంజులకిచ్చిన హామీ పది రోజుల్లోనే నెరవేరడం విశేషం.

42 సంవత్సరాల టీడీపీ చరిత్రంలో పోలింగ్ రోజున రెంటాల గ్రామానికి ఎమ్మెల్యే అభ్యర్థి రెండు సార్లు వెళ్లడం (యరపతినేని మినహా) అరుదు. 2009లో గ్రామంలోకి వెళ్తున్న బ్రహ్మానందరెడ్డి, మోదుగుల వేణుగోపాలరెడ్డి సోదరుడు, వేముల నాగమ్మ మీద దాడి చేశారు. అటువంటిది రెండు సార్లు బ్రహ్మారెడ్డి గ్రామంలోకి రావడంతో ప్రత్యర్థి పార్టీ నేతల్లో ఆవేశం కట్టలు తెంచుకుంది. అప్పటికే ఎస్సీ కాలనీలో బ్రహ్మారెడ్డిని బందిచే యత్నం చేశారు. ఆ తర్వాత తూర్పు బజార్ పోలింగ్ బూత్ వద్ద వెళ్లగానే బ్రహ్మారెడ్డి బృందంపై కారంతో దాడి చేశారు. దుర్భాషలాడి దాడికి ఉపక్రమించారు. కార్లపై రాళ్ళతో దాడి చేశారు. చివరకు పెట్రోల్ పోసి నిప్పంటించారు. వెంటనే చంద్రబాబు కాన్ఫరెన్సు కాల్ ద్వారా బ్రహ్మారెడ్డితో మాట్లాడి టీడీపీ శ్రేణులను జాగ్రత్తగా వుండమని ఆదేశించారు.

పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు..

టీడీపీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపునిస్తారనే దానికి మంజులరెడ్డికి పదవి ఓఉదాహరణ మాత్రమే. బ్రహ్మానందరెడ్డి గెలుపు కోసం వేలాది మంది మంజులారెడ్డి లాంటి వాళ్ల కృషి ఎంతో ఉంది. ఆమె పోరాటం టీడీపీ శ్రేణులకు ఆదర్శ ప్రాయం, స్ఫూర్తిదాయకం.

ఓటు నమోదుకు

ఒక్క అర్జీ రాలేదు


మాచవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటు నమోదు చేసుకోవడం కోసం ఎన్నికల కమిషన్ శనివారం, ఆదివారం అవకాశం కల్పించింది. శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో 50 పోలింగ్ కేంద్రాల వద్ద ఆయా గ్రామాల బీఎల్‌వోలు ఉన్నప్పటికీ ఓటు నమోదు కోసం ఒక్క అర్జీ కూడా రాకపోవటంతో ఆశ్చర్యం కలిగించింది. నూతన ఓటు నమోదుపై ఆయా గ్రామాల్లో ప్రచారం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తహసీల్దార్ క్షమారాణి వేమవరం, తురకపాలెం, మాచవరం ఓటు నమోదు కేంద్రాలను పరిశీలించి బీఎల్‌వోలకు సూచనలు, సలహాలు సూచించారు. ఆమె వెంట ఆర్‌ఐ కోటేశ్వరరావు, ఆయా గ్రామాల బీఎల్‌వోలు, కంప్యూటర్ ఆపరేటర్ నవీన్ తదితరులు ఉన్నారు.

ప్రజాపోరుకు సిద్ధం కండి

ముప్పాళ్ళ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిరంకుశ ప్రజావ్యతిరేఖ విధానాలపై ప్రజపోరుకి సిద్ధంకండని సీపీఎం మండల కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ పిలుపునిచ్చారు. చాగంటివారిపాలెం రోడ్డు సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ప్రజాపోరు కరపత్రాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు నిత్యవసర ధరలు పెరిగిపోతున్నాయని, దీంతో సామాన్యులు మూడు పూట్ల ఆహారం తీసుకునే పరిస్థితి ఉండటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న జెమిలి ఎన్నిల నినాదం రాష్ట్రాల హక్కులను హరించి వేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ ఈ నెల 14న తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు పలువురు పాల్గొన్నారు.

నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రాలు

● రోడ్ల వెంబడి పేరుకుపోతున్న చెత్త నిల్వలు



చాగంటివారిపాలెంలో నిరుపయోగంగా చెత్త సేకరణ కేంద్రం

ముప్పాళ్ళ నవంబరు 9 (ఆంధ్రజోతి): గ్రామాలలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపదను సృష్టి కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. అధికారుల పర్యవేక్షణా లోపంతో వాటి లక్ష్యం నెరవేరడంలేదు. మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో ప్రతి గ్రామంలోను రూ. 6 లక్షల వరకూ వెచ్చించి చెత్త సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. తర్వాత వైసీపీ ప్రభుత్వంలో వాటిని సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పేరుతో పిలుస్తూ వర్మికంపోస్ట్ తయారు చేసేందుకు ప్రతి కేంద్రంలో ఒక్కొక్క తొట్టికి రూ.15 వెచ్చించి 10 తొట్లను కట్టించారు. గ్రీన్ అంబాసిడర్ల పేరుతో ప్రతి పంచాయతీకీ గ్రామ జనాభాను బట్టి ప్రతి 1000 మంది ఒక్కరిని చెత్త సేకరించేందుకు నియమించారు. వారికి గ్రామ పంచాయతీ నుంచి రూ. 6 వేలను జీతంను చెల్లించారు. కానీ గ్రామాలలో చెత్త నిల్వలు పేరుకు పోయి వాటినుండి ప్రజలకు రోగాలు వ్యాప్తి చెందుతున్నాయి. గ్రామంలో చెత్త సేకరించేందేకు ఏర్పాటు చేసిన వాహనాలు ఎక్కడున్నాయో ఎవరికీ తెలియదు.ప్రభుత్వం ప్రతి పంచాయతీకి లక్షలు ఖర్చుపెట్టినా పారిశుద్యం మెరుగుపరచలేక పోవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలున్నాయి. ఈ విషయమై ఈవోపీఆర్డీ శింగమనేని రూపవతిని వివరణ కోరగా గ్రామాల్లో చెత్తసేకరణ వాహనాలు మరమ్మతలకు గురయ్యాయని పరిశీలిస్తానని తెలిపారు.

వైసీపీ నేతలపై ఫిర్యాదు

బెల్లంకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : టీడీపీపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెడుతున్న వైసీపీశ్రేణులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర తెలుగు యువత మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ శనివారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి చెందిన అక్కల మధుసూదనరెడ్డి, గుర్రాల బడ బచ్చా(కరిముల్లా) మరికొంతమంది సోషల్ మీడియాలో టీడీపీపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ విషయమై ఎస్‌ఐ ప్రవీణ్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశా కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ, నేతలు అక్కల వెంకట రామిరెడ్డి, గుడిసె కొండయ్య, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అసభ్యకర పోస్టులపై కేసు

మాచవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్జంపాడు గ్రామంలో అసభ్యకర పోస్టులు పెట్టిన ఒక వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కే సతీష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామానికిచెందిన మున్నంగి నరసింహస్వామి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జంగా కృష్ణమూర్తిలపై అసభ్యకర పదజాలంతో పోస్టు పెట్టాడంటూ మోర్జంపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

మాచర్లటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మాచర్ల కోర్టు ప్రభుత్వ న్యాయవాది జీవీ అన్నారు. పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శనివారం మండల న్యాయ సేవా కమిటి ఆధ్వర్యాన జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాది జీవీ మాట్లాడుతూ చాలా మంది కోర్టుకు వెళ్లడమంటే డబ్బుతో కూడిన వ్యవహారం అని సమస్యలను పెండింగ్‌లో పెట్టుకుంటున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీలు ఉచిత న్యాయం కోసం కోర్టును ఆశ్రయించవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది గంగుల శ్రీనివాసరావు, న్యాయ సేవా కమిటి సభ్యుడు మెట్టు గోవిందరెడ్డి, ప్రిన్సిపాల్ కవితా తదితరులు పాల్గొన్నారు.

చోరీ ఘటనలో ఇద్దరిపై కేసు

రెంటచింతల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి):దొంగతనం చేసి భారీగా బంగారం ఎత్తుకెళ్లిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. మంచికల్లు గ్రామానికి చెందిన శీలంనేని అనంతరామయ్య గృహంలో ఈనెల 7న దొంగతనం జరిగింది. ఈ ఘటనలో 12.50 సవర్ల బంగారాన్ని దొంగిలించిన గన్నవరం గ్రామానికి చెందిన కందుకూరి అన్నారావు, పాముల రాహులరావుపై కేసు నమోదు చేశారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో

కండ్లకుంట హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

నకరికల్లు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భీమవరంలోని ఎస్‌సీహెచ్‌బీఆర్ హైస్కూల్‌లో ఈనెల 8, 9 తేదీల్లో అండర్ - 14, అండర్ - 17, అండర్ - 19 విభాగాల్లో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈపోటీల్లో కండ్లకుంట జడ్పీ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. రోప్ కిప్పింగ్‌లో మొగిలి మణికంఠ, ఉప్పలపాటి మహేష్, షేక్ అబ్దుల్ రహీం, డీ విజయ్, మొగిలి బాల ప్రవీణ్‌రాజ్, జీ ఆకాష్‌లు పతకాలను సాధించారు. బాలికల విభాగంలో ఎల్ భావన బంగారు పతకం సాధించగా, డీ అయోషా, ఎం ఆనంద కుమారి, జీ అంజలి వెండి, రజిత పతకాలను సాధించారని ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఉన్నం పద్మావతి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెచ్‌ఎం బీవీఎల్‌ఎల్ వర ప్రసాదు, ఎంఈవో ఎంఎల్‌ఎన్ ప్రసాదులు అభినందించారు.

పేద విద్యార్థుల అభ్యున్నతే బిగ్ హెల్ప్ ధ్యేయం

మాచర్ల రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో పేద విద్యార్థుల అభ్యున్నతే బిగ్ హెల్ప్ ధ్యేయమని బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ వ్యవస్థాపకుడు, చైర్మన్ షేక్ చాంద్‌బాషా అన్నారు. శనివారం మండలంలోని విజయపురి సౌత్ ప్రభుత్వోన్నత పాఠశాలలో నిర్వహించిన బిగ్‌హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ 22వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 1500 మంది పేద విద్యార్థులకు బిగ్ హెల్ప్ అండగా నిలిచిందన్నారు. ముందుగా చాంద్‌బాషా తన సొంత ఖర్చులు రూ. 5 లక్షలతో పాఠశాలలో నిర్మించిన ఆడిటోరియాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బిగ్ హెల్ప్ మేనేజింగ్ ట్రస్టీ మాటూరి సరోజిని, భాస్కర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక డ్రైవ్

మునిసిపల్ కమిషనర్ షమ్మి

ఫటాఫట్



కమిషనర్ షమ్మి

సత్తెనపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి పురపాలక సంఘం పరిధిలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని పురపాలక సంఘం కమిషనర్ షమ్మి తెలిపారు. ఆయనతో ఆంధ్రజ్యోతి ప్రతినిధి 'ఫటాఫట్.'

ప్ర : ప్లాస్టిక్ నిషేధంపై ఏ చర్యలు తీసుకుంటున్నారు?

జ : డిసెంబరు 1వ తేదీ నుంచి పట్టణంలో ప్లాస్టిక్ నిషేదాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తాం. ప్లాస్టిక్ గ్లాసులు, కప్పులతో పాటు 20 మైక్రాన్‌ల నుంచి 1 యూజ్ కవర్లను పూర్తిగా నిషేదిస్తున్నాం.

ప్ర : నిబంధనలు మీరితే చర్యలేమిటి ?

జ : ఎవరైనా ప్లాస్టిక్ కవర్లు అమ్మినా, షాపుల్లో నిల్వలు చేసినా మొదటి సారి రూ.20వేలు, రెండవ సారి రూ.40వేలు జరిమానా విధిస్తాం. మూడవ సారి దొరికితే షాపు ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తాం. వీధి వ్యాపారుల వద్ద కవర్లు దొరికితే వెయ్యి నుంచి రూ 2వేలు వరకు జరిమానా విధిస్తాం.

ప్ర : పట్టణ రోడ్లపై పశు సంచారం నియంత్రణ ఎలా ?

జ : పట్టణంలో పశువులను నియంత్రించేందుకు పశువులను పట్టుకొని బందెల దొడ్డికి తరలించి యజమానులను హెచ్చరిస్తాం. మళ్ళీ అవి రోడ్ల పై కన్పిస్తే గోశాలకు తరలిస్తాం.

జ : పట్టణంలోని ప్లాన్‌కు విరుద్దంగా నిర్మాణాలు చేసినా వారి పై చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు ప్లాన్‌కు విరుద్దంగా నిర్మాణాలు చేసినా 135 మందికి నోటీసులు జారీ చేశాం. అవసరమైతే వారిపై కేసులు పెడతాం. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులకు ఈ విషయంపై స్పష్టత ఇచ్చాం.

ప్రశ్న : 15వ ఆర్థిక సంఘం నిధుల తో ఏయే పనులు చేస్తున్నారు?

జ : పట్టణానికి రూ 1.50 కోట్ల వరకు ఆర్థిక సంఘం నిధులు వచ్చాయి. వాటితో డ్రైయిన్‌ల నిర్మాణం, రోడ్ల అభివృద్ధి, నీటి సరఫరా మెరుగు వంటి పనులు చేస్తున్నాం.



స్కాలర్ షిప్‌ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తదితరులు

కన్నా రంగయ్య ట్రస్టు ఆధ్వర్యంలో

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

సత్తెనపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో శనివారం కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఉప వేతనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సేవలను విస్తృతం చేస్తామన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, రామకృష్ణాపురం గురుకుల పాఠశాలలకు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా రక్షిత మంచి నీరు అందిస్తామన్నారు.కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, ఎలినేడి రామస్వామి, ఆళ్ళ అమరేశ్వరరావు, చౌటశ్రీనివాసరావు, కోమటినేని శ్రీనివాసరావు, బత్తుల వెంకట స్వామి, కంభాల వెంకటేశ్వరరావు, నూర్ బాషా జానీబాబు, పూజల వెంకటకోటయ్య, నాగేశ్వరరావు, ఆదినారాయణ,శంకరరావు, భవన్నారాయణ, నాగరాజు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహ పూర్వకంగానే విధుల నిర్వహణ

● ఏపీ జల వనరుల శాఖ ఎస్‌ఈ కృష్ణమోహన్

మాచర్ల రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు స్నేహపూర్వకంగా విధులు నిర్వహిస్తున్నారని ఏపీ జలవనరుల శాఖ ఎస్‌ఈ కృష్ణమోహన్ తెలిపారు. శనివారం మండలంలోని విజయపురిసౌత్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇరు రాష్ట్రాల అధికారులు పరస్పరం సమన్వయంతో సాగర్ ప్రాజెక్ట్ గేట్ల నిర్వహణను నిత్యం పరిశీలిస్తున్నారన్నారు. సాగర్ కుడి కాలువ రీడింగ్ విషయంలో సమాచార లోపం వలన ఇద్దరు ఉద్యోగుల మధ్య స్వల్పవివాదం చోటుచేసుకుందన్నారు. ఆ ఉద్యోగులతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. చిన్న విషయాన్ని రాష్ట్రాల గొడవగా చిత్రీకరించవద్దని ఎస్‌ఈ కృష్ణమోహన్ కోరారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

నకరికల్లు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని రూపెనగుంట్ల గ్రామంలో శనివారం ఉపాధి పనులపై గ్రామ సభ నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ 57,19,736 లను ఉపాధి కూలీలకు రూ 1,03,607లు మెటీరియల్ కింద మొత్తం రూ 58,23,343 నిధులను ఖర్చు చేసినట్టు గ్రామ సభలో సామాజిక తనిఖీ బృందం వెల్లడించింది. గ్రామంలో చేపట్టిన పనులను, ఖర్చులను గ్రామ సభలో చదివి వినిపించారు. గ్రామంలో క్షేత్ర స్థాయిలో పనులే జరగకుండా రికార్డుల్లో మాత్రమే నమోదుచేసి చెల్లింపులు చేసినట్టు తనిఖీల్లో వెల్లడైనట్టు అధికారులు తెలిపారు. పనులకు వెళ్ళనివారికి చెల్లింపులు చేసినట్టు తనిఖీలో వెలుగుచూశాయి. చేయని పనులకు బిల్లులు చెల్లించినట్టు ఆడిట్ బృందం గుర్తించింది.

సభ్యత్వ నమోదును

వేగవంతం చేయాలి

పెదకూరపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ అన్నారు. మండలంలోని పాటిబండ్లలో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదును రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రామగోపాలరావు, శివమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలను... కాపాడుకున్నారు!

1982లో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. 2001 నాటికి కళాశాలలో చేరే విద్యార్థుల్లేక మూసివేసే పరిస్థితి. ఈ క్రమంలో గురజాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విలీనం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎలాగైనా కళాశాలను నిలుపుకోవాలని గ్రామస్తుల తపన. ఈ దశలో వారు చేసిన చిరు ప్రయత్నం కళాశాలకు మంగళం పాడే దశ నుంచి మహర్దశకు చేర్చింది. ఆ ప్రయత్నమే దాతల సహకారంతో ఉచిత మధ్యాహ్న భోజన పథకం. అంతే నేడు కళాశాల పరిస్థితి మారిపోయింది. ఇదీ దాచేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విజయగాథ.

- మంగళం పాడే దశ నుంచి మహర్దశకు చేరుకున్న వైనం
- దాతల సహకారంతో ఉచితంగా మధ్యాహ్న భోజనం
- ఇంటింటికీ వెళ్లి విజయాలు వివరిస్తున్న అధ్యాపకులు

(దాచేపల్లి, నవంబరు 9, ఆంధ్రజ్యోతి) రెండు దశాబ్దాలుగా దాతల సహకారంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. 1982లో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. 2001 నాటికి కళాశాలలో చేరే విద్యార్థు ల్లేక మూసివేసి గురజాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలిపే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో దాచేపల్లిలోని గ్రామస్తులంతా ఐక్యంగా కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే పేద విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనం, ప్రభుత్వానికి చెల్లించాల్సిన కాలేజి ఫీజు కూడా తామే స్వయంగా చెల్లించి విద్యార్థులు కాలేజీలో చేరే విధంగా కృషి చేశారు. వారి కృషి ఫలించి కళాశాలను ఎత్తివేసే పరిస్థితుల నుంచి కేవలం సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులతో కళాశాలను కొంతకాలం నడిపారు. పిల్లల్లో మరింత ప్రతిభను సాధించేందుకు గానూ ట్యూషన్లు పెట్టి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచారు. ఫలితంగా కేవలం రెండు అంకెలకే పరిమితమైన విద్యార్థుల సంఖ్య మూడు అంకెలకు చేరింది. ప్రస్తుతం కళాశాలలో 178 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో కళాశాల అభివృద్ధి కమిటీ విన్నపం మేరకు ఇంటర్ బోర్డు ఎంపీసీ, బైపీసీ గ్రూపులను కూడా మంజూరు చేసింది. 2020-21లో 100 శాతం, 2021-22లో 100 శాతం, 2022-23 సంవత్సరంలో 97 శాతం ఉత్తీర్ణత సాధించింది. 2022-23లో కళాశాలకు చెందిన పానుబోతు మానస 965 మార్కులు సాధించి ఐఐటీలో సీటును దక్కించు కుంది. కళాశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేద వర్గాలకు చెందిన విద్యార్థులు అధికంగా ఉన్నారు. ఆయా విద్యార్థుల కుటుంబాలు వ్యవసాయ కూలీలు, కార్మిక వర్గాలకు చెందిన వారే అధికంగా ఉన్నారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేందుకు మధ్యాహ్న భోజనం తోడ్పడింది.

స్థానికుల ప్రశంసలు

ప్రభుత్వం ఒకటి నుంచి 10వ తరగతిలోపు విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజనం అందిస్తుంది. దాచేపల్లిలో కొంతమంది దాతలు ఇచ్చిన నగదుతో కళాశాల అభివృద్ధి కమిటీ చేపట్టిన మధ్యాహ్న భోజనం నిర్విరామంగా రెండు దశాబ్దాలుగా కొనసాగించడం స్థానికులచే ప్రశంసలు అందుకుంటుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడా కూడా ఇంటర్ విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం అందుబాటులో లేదు. ఇది కేవలం దాచేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఘనతే. ఇదే విధానాన్ని దాతల సహకారంతో మరింత మెరుగ్గా కొనసాగించేందుకు అభివృద్ధి కమిటీ చర్యలు తీసుకుంటుంది.



దాచేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

విద్యతోపాటు..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని అధ్యాపకులు ఉదయం 7 గంటల సమయంలో గ్రామాల్లో తల్లిదండ్రుల వద్దకు వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని కోరుతూ గత విద్యార్థులు సాధించిన ఫలితాలను, విజయాలను వివరిస్తున్నారు. విద్యతోపాటు ఉచిత భోజనం కూడా అందజేస్తున్నామని తెలియజేస్తున్నారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వం అన్ని అర్హతలు ఉన్న అధ్యాపకులచే నాణ్యమైన బోధన అందిస్తుందని తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. విద్యార్థులను కళాశాలలో చేర్పించే విధంగా కృషి చేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డును వారికి అందించడంతో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య సత్సం బంధాలు ఏర్పడుతున్నాయి.



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖరబాబు, ఇతర అధ్యాపకులు

పేద విద్యార్థులకు అండగా..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులంతా నిరుపేద కుటుంబాలకు చెందినవారే. దాతల సహకారంతో మధ్యాహ్న భోజనం నిర్వహించడంతో విద్యార్థులకు కొంత ఆర్థికంగా వెసులుబాటు కలిగింది. మధ్యాహ్న సమయంలో విద్యార్థులు భోజనానికి ఇంటికి వెళ్లకుండా కాలేజిలో చేయడంతో తరగతు లకు గైర్హాజరు శాతం తగ్గింది. ఫలితంగా ఉత్తీర్ణత 100 శాతం సాధిస్తున్నాం.



- చంద్రశేఖరబాబు, కళాశాల ప్రిన్సిపాల్

ప్రభుత్వం సహకరించాలి

గత 21 సంవత్సరాలుగా దాతల సహకారంతో ప్రభుత్వ కళాశాలలో ఉచిత భోజనం అందిస్తున్నాం. ప్రభుత్వం ముందుకొచ్చి మధ్యాహ్న భోజనానికి తమ వంతుగా సహకరించాలి. తద్వారా ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరేందుకు అవకాశం ఉంది.



-తెలనాకుల సత్యనారాయణ, అభివృద్ధి కమిటీ చైర్మన్

రోడ్డెక్కనున్న ఎలక్ట్రిక్ బస్సులు

- పాత డొక్కు బస్సుల స్థానంలో వినియోగం
- గుంటూరు డిపోలకు 200 బస్సులకు ప్రతిపాదన
- మంగళగిరి, విజయవాడ, రాజధానికి రాకపోకలకు
- మంగళగిరి, గుంటూరులో హైస్పీడ్ చార్జింగ్ స్టేషన్లు

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డొక్కు బస్సుల స్థానంలో కొత్త ఎలక్ట్రిక్ బస్సుల కోసం ఆర్టీసీ యంత్రాంగం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అద్దె ప్రాతిపదికన మంగళగిరి, గుంటూరు-1, 2 డిపోలకు సంబంధించి 200 ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రతిపాదనలు చేశారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఆర్టీసీలో ఒక్క కొత్త బస్సు కొన్న పాపాన పోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ పూర్వ వైభవానికి



చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే విభజిత జిల్లాకు 59 బస్సులు కేటాయించగా ఇందులో 42 సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. అంతేగాక కాలుష్య రహిత చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. మంగళగిరికి 100, గుంటూరు-1,2 డిపోలకు మరో 100 బస్సులను కేటాయించనున్నారు. ఈ బస్సులు అందుబాటులోకి వచ్చాక మంగళగిరి బస్టాండ్ నుంచి రాజధాని అమరావతి ప్రాంతంతో పాటు విజయవాడ రూట్‌కు ట్రిప్పులు పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. మంగళగిరి నుంచి విజయవాడ రైల్వేస్టేషన్, విజయవాడతో పాటు నున్న వంటి ప్రాంతాలకు కూడా సర్వీసులను నడపాలని ప్రతిపాదనలు చేస్తున్నారు. గుంటూరు - విజయవాడ రాకపోకలకు కూడా ఇవే బస్సులను వినియోగించాలని భావిస్తున్నారు. ఈ బస్సుల చార్జింగ్ స్టేషన్ల కోసం డీపీటీవో రవికాంత్ నేతృత్వంలో పలు ప్రాంతాల్లో అన్వేషణ ప్రారంభించారు. ఆ తర్వాత గుంటూరు, మంగళగిరి కేంద్రంగా హైస్పీడ్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. మంగళగిరి డిపోతో పాటు గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్ ఆవరణలో ఉన్న విజయవాడ నాన్‌స్టాప్ బస్టాండ్ వద్ద హైస్పీడ్ చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. త్వరలోనే ఇది కార్యరూపం దాల్చితే పాత బస్సుల స్థానంలో కొత్త ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయని అధికారులు చెబుతున్నారు.

బోరుగడ్డ తీరు మరోసారి

వివాదాస్పదం

- పోలీస్‌స్టేషన్‌లోనే రిమాండ్ ఖైదీ బల్లపై నిద్ర
- ఆలస్యంగా వెలుగు చూసిన సీసీ కెమెరా ఫుటేజ్
- రాచమర్యాదలపై ఖండించిన ఎస్పీ సతీష్ కుమార్

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ బోరుగడ్డ అనీల్ పోలీస్ కస్టడీ వ్యవహారం మరోసారి వివాదాస్పదంగా మారింది. ఇటీవల గన్నవరంలో ఓ హోటల్ ఘటన మరువక ముందే గుంటూరులోని అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో బోరుగడ్డ విషయంలో పోలీసుల తీరు మళ్లీ వివాదాస్పదమైంది. ఏఈఎల్సీ చర్చి కోశాధికారి కర్లపూడి బాబుప్రకాష్‌ను కత్తితో బెదిరించి రూ.50 లక్షలు డిమాండ్ చేసిన కేసులో నిందితుడిగా రిమాండ్‌లో ఉన్న బోరుగడ్డ అనిల్‌ను ఇటీవల అరండల్‌పేట పోలీసులు కస్టడీకి తీసుకున్న విచారించారు. ఈ క్రమంలో రాత్రికి స్టేషన్‌లోనే అనిల్ కుమార్ బసచేశారు. ఆ సమయంలో ఆయనకు పోలీస్‌స్టేషన్లోని టేబుల్‌పై బెడ్ షీట్లు పరుచుకుని, దిండు వేసుకుని నిద్రించే అవకాశం కల్పించడం, అదే సమయంలో ప్రైవేటు వ్యక్తి వచ్చి ఆయనతో ముచ్చటించే వెసులుబాటు కల్పించడం వంటి అంశాలు తీవ్ర దుమారం రేపాయి. ఇప్పటికే బోరుగడ్డ విషయంలో పోలీస్ శాఖపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్న తరుణంలో తాజాగా వెలుగు చూసిన ఈ వ్యవహా రం అగ్గికి ఆజ్యం పోసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునే విధంగా వికృత రూపంలో ప్రతిపక్ష పార్టీల నాయకులను, వారి కుటుంబ సభ్యులను, మహిళలను, చిన్నపిల్లలను సైతం అసభ్యకరంగా దూషిస్తూ, బెదిరిస్తూ రెచ్చిపోయిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్ విషయంలో పోలీసులు ఎందుకు ఇంత ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది.

కోర్టు ఉత్తర్వులతోనే అవకాశం కల్పించాం : ఎస్పీ

విచారణలో ఉన్న ఖైదీ బోరుగడ్డకు పోలీసులు రాచమర్యాదలు చేస్తున్నారని కొందరు చేస్తున్న



ప్రచారం వాస్తవం కాదని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. శనివారం పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనిల్‌ను అదుపులోకి తీసుకున్న సమయంలో పోలీసులు తనను కొట్టారని చెప్పడంతో కనీస సదుపాయాలు కల్పించాలని మెజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారన్నారు. వైద్య పరీక్షల్లో గ్యాస్ట్రిక్ సమస్య ఉన్నట్లు వైద్యులు చెప్పడంతోనే బల్లపై పడుకునే అవకాశం ఇచ్చామన్నారు. అంతేగాని ఆయనకు ప్రత్యేకంగా రాచమర్యాదలు ఏమీ చేయలేదన్నారు. స్టేషన్ నుంచి సీసీ కెమెరా ఫుటేజ్ ఎలా బయటకు వచ్చిందనే దానిపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. బోరుగడ్డను ఎస్కార్ట్ పోలీసులు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తీసుకు వెళుతున్న సమయంలో గన్నవరంలో ఓ రెస్టారెంట్‌కు తీసుకెళ్లిన సందర్భంలో జరిగిన పరిణామాలపై ఏడుగురు పోలీసులను సస్పెండ్ చేశామని తెలిపారు. శాఖాపరమైన దర్యాప్తు తర్వాత వారిపై మరిన్ని చర్యలు ఉంటాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బోరుగడ్డపై అనేక పోలీస్ స్టేషన్లో కేసు ఉన్నప్పటికీ ముందుగా ఆయనను అరెస్ట్ చేసింది తామేననే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మాజీ ఎంపీ నందిగం సురేష్ 2020లో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నా అప్పట్లో ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని, తాను వచ్చిన తర్వాత ఆ కేసును బయటకు తీసి చర్యలు తీసుకున్నామని చెప్పారు. శాఖ పరంగా తాము ఎక్కడా రాజీ పడలేదని తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అరండల్‌పేట సీఐపై వేటు

బోరుగడ్డ వ్యవహారంలో మరో పోలీసు అధికారి బలయ్యారు. స్టేషన్‌లో రాత్రివేళ ఆయనకు రాచ మర్యాదలు చేశారంటూ అందుకు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు అధికారులు అప్రమత్తమయ్యారు. ఆయా ఆరోపణల నేపథ్యంలో అరండల్‌పేట సీఐ కే శ్రీనివాసరావును వీఆర్‌కు పంపుతూ శనివారం రాత్రి రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠత్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. బోరుగడ్డ వ్యవహారంలో పోలీస్ శాఖలో వరుసగా జరుగుతున్న ఘటనలు ఆ శాఖలో చర్చనీయాంశంగా మారాయి.

మండలి ఎన్నికల్లో..

ముందే కాడి పడేసిన వైసీపీ



- ఘోర ఓటమి తప్పదని కుంటిసాకులు
- గతంలో ఎన్నడూ గెలిచిన దాఖలాలు లేవు
- జనరల్ ఎన్నికల్లో వైసీపీ ఓటమికి విద్యావంతులే కారణం
- మళ్లీ అదే పరిస్థితులు ఎదురవుతాయని బరి నుంచి తప్పుకున్న వైనం
- కూటమి అభ్యర్థి ఆలపాటి, సిట్టింగ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మధ్యనే ఈ సారి పోటీ

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలి ఎన్నికలకు సమాయత్తమవుతూ ఓటర్ల చేర్పులకు శిబిరాల నిర్వహణ, మేధావులతో, పార్టీ శ్రేణులతో ఎక్కడికక్కడ సమావేశాలో టీడీపీ నేతలు, అభ్యర్థి ఉండగా.. అందుకు భిన్నమైన స్థితిలో వైసీపీ ఉంది. గతానుభవాల దృష్ట్యా ఘోర ఓటమి తప్పదని ముందే గ్రహించి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఎన్నికకు ముందే వైసీపీ కాడి కింద పడేసింది. రాష్ట్రంలో ఎన్నికలు సజావుగా జరిగే పరిస్థితి లేదంటూ తాము ఎన్నికల బరి నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించారు. దీంతో మరో నాలుగు నెలల్లో జరగనున్న ఎన్నికలో పోటీ టీడీపీ బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, యూటీఎఫ్ మద్దతుతో తిరిగి బరిలోకి దిగనున్న సిట్టింగ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మధ్యనే జరగనుంది. ఈ ఎన్నికల్లో తప్పక వైసీపీ పోటీ చేస్తుందని ముందుగానే ఆ పార్టీ పెద్దలు విజయవాడకు చెందిన గౌతంరెడ్డి పేరుని ప్రకటించి ఓటరు నమోదు ప్రచార కార్యక్రమాలను కూడా నిర్వహించి ఇప్పుడు ముఖం చాటేయడంపై ఆ పార్టీ శ్రేణులు తీవ్ర నిరాశకు గురౌతున్నాయి. సార్వత్రిక ఎన్నికల తర్వాత గుంటూరు, కృష్ణా జిల్లాల్లో లక్షల మంది పట్టభద్రులు పాల్గొనబోయే ఎన్నిక వచ్చే మార్చిలో జరగనుంది. దాదాపుగా 3 లక్షల మందికి పైగా పట్టభద్రులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ నియోజకవర్గం పునరుద్ధరణ జరిగినప్పటి నుంచి తొలుత చిగురుపాటి వరప్రసాద్, ఆ తర్వాత వరుసగా బొడ్డు నాగేశ్వరరావు, కేఎస్ లక్ష్మణరావు గెలుపొందారు. వైసీపీ ఏర్పడిన తర్వాత రెండు సార్లు ఈ నియోజకవర్గానికి ఎన్నిక జరిగింది. ఆ పార్టీ అండ తమకుందని చెప్పుకుని బరిలోకి దిగిన వారు ఎప్పుడూ గెలవలేదు. కాగా గత సార్వత్రిక ఎన్నికల్లో తమకు 40 శాతం ఓటు షేర్ వచ్చిందని, ఈ ఐదు నెలల్లో కూటమి ప్రభుత్వం పరిపాలనలో విఫలమైందని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా తిరిగి తామే భారీ మెజార్టీతో గెలుస్తామని వైసీపీ నేతలు గత కొన్ని రోజుల నుంచి ఊదరగొడుతున్నారు. అలాంటప్పుడు ప్రజల్లో వారి బలమెంతో నిరూపించుకొనే చక్కటి అవకాశం కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక రూపంలో వచ్చింది. ఎన్నికల బరిలో నిలిచి తమ బలమేంటో చూపెట్టాల్సింది పోయి ముందుగానే ఓటమి ఖాయమని తెలిసి పోటీ నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించింది. అందుకు కుంటిసాకులు చెప్పకనే చెప్పింది. వైసీపీ ఐదేళ్ల పరిపాలనలో నిరుద్యోగులను గాలికొదిలేసింది. ఉద్యోగాల కల్పన, పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం లేకుండా చేసింది. దీంతో ఉపాధి, ఉద్యోగాలు లేక పట్టభద్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. వాళ్లంతా మళ్లీ తమని ఘోరంగా ఓడిస్తారని గ్రహించిన వైసీపీ నేతలు పరువు పోగొట్టుకోవడం ఖాయమని భావించే ఎన్నికల నుంచి తప్పుకున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

హిమాచల్‌ప్రదేశ్‌పై ఆంధ్రా ఘన విజయం



సాత్విక్ (68 పరుగులు)



రాజేష్ (4 వికెట్లు)

మంగళగిరి సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మంగళ గిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న కూచ్ బెహర్ ట్రోఫీలో హిమాచల్‌ప్రదేశ్ జట్టుపై ఆంధ్రా జట్టు 200 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఆంధ్రా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 615 పరు గులు సాధించి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 132 పరుగులకు ఆలౌటైన హిమాచల్‌ప్రదేశ్ జట్టు ఫాలో న్‌తో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించి 103.5 ఓవర్లలో 283 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆ జట్టులో సాత్విక్ కటోచ్ 9 ఫోర్లతో 68 పరుగులు చేసి రాణించాడు. ఆంధ్రా బౌలర్ ఎన్.రాజేష్ 30.5 ఓవర్లలో 73 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. దీంతో ఆంధ్రా జట్టు ఇన్నింగ్స్ 200 పరుగులతో ఘనవిజయం సాధించింది.

రసవత్తరంగా రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలు

ప్రత్తిపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 68వ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలు ప్రత్తిపాడు మండలం యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రసవత్తరంగా సాగాయి.



పోటీలలో తలపడుతున్న జట్లు

బాలురు, బాలిక విభాగాలకు సంబంధించి వివిధ జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో క్రీడాకారులు తమ సత్తా చాటారు. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల పరిధిలో ఈ పోటీలు జరిగాయి. 13 జిల్లాల నుంచి బాలురు, బాలికల జట్లు ఈ పోటీలలో తలపడ్డాయి.

బాలుర విభాగంలో..

గుంటూరు, విశాఖపట్నం జిల్లాల జట్లు పోటీలో తలపడగా, గుంటూరు జిల్లా బాలురు 5-2 తేడాతో విజయం సాధించారు. శ్రీకాకుళం, కృష్ణా జిల్లాల మధ్య జరిగిన పోటీలో 7-2 తేడాతో శ్రీకాకుళం జిల్లా, విజయనగరం, కర్నూలు జిల్లాల మధ్య జరిగిన పోటీలో 2-1 తేడాతో కర్నూలు జిల్లా, అనంతపురం, చిత్తూరు జిల్లాల మధ్య జరిగిన పోటీలలో 5-4 తేడాతో అనంతపురం జట్లు విజయం సాధించాయి. చివరి లీగ్ మ్యాచ్‌లో గుంటూరు, నెల్లూరు జిల్లాల మధ్య పోటీలో గుంటూరు జిల్లా 7-1 తేడాతో విజయం సాధించింది.

బాలికల విభాగంలో..

ప్రకాశం, తూర్పుగోదావరి జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో ప్రకాశం జిల్లా 7-1 తేడాతో, శ్రీకాకుళం, అనంతపురం జిల్లాల మధ్య జరిగిన పోటీలో శ్రీకాకుళం జట్టు 4-2 తేడాతో, విజయనగరం, పశ్చిమగోదావరి జిల్లాల మధ్య జరిగిన పోటీలో విజయనగరం 2-1 తేడాతో, గుంటూరు, కర్నూలు జిల్లాల మధ్య జరిగిన పోటీలో గుంటూరు జిల్లా 8-2 తేడాతో విజయం సాధించాయి. అలాగే విశాఖపట్నం, కృష్ణ జిల్లాల మధ్య జరిగిన పోటీలో విశాఖపట్నం జిల్లా జట్టు 4-3 తేడాతో విజయం సాధించింది.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి : డీఈవో

పిట్టలవానిపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యతోపాటు క్రీడారంగంలో మరింతగా రాణించాలని డీఈవో ఎస్. పురుషోత్తం అన్నారు. పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత



కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న బాపట్ల డీఈవో పురుషోత్తం

పాఠశాల క్రీడా మైదానంలో బాపట్ల జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి షేక్ కరీముల్లా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. 68వ స్కూల్‌గేమ్స్ కబడ్డీ 14 సంవత్సరాలలోపు గల క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారు. డీఈవో పురుషోత్తం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన 3శాతం క్రీడా రిజర్వేషన్లను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్‌గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరి ప్రశాంత్‌బాబు, రౌండ్‌టేబుల్ వెంకటేష్, కేర్‌స్కూల్ ప్రిన్సిపాల్ రమణమూర్తి, స్టేట్ అబ్జర్వర్ సుధాకర్, పాఠశాల హెచ్ఎం షేక్ మహబూబ్ సుభానీ, విద్యాకమిటీ చైర్మన్ డి.లక్ష్మీతిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈక్రీడలలో 13 బాలుర జట్లు గుంటూరు, విశాఖ పట్టణంపై 57.37, తూర్పుగోదావరి, ప్రకాశం జిల్లాపై 43.42, చిత్తూరు, అనంతపురం జిల్లాపై 52.46, కృష్ణా, నెల్లూరు జిల్లాపై 65.47, శ్రీకాకుళం, పశ్చిమగోదావరిజిల్లాపై 87.23తో విజయం సాధించారు. 13 బాలికల జట్లు గుంటూరు, విజయనగరంపై 39.7, అనంతపురం, కడపపై 48.13, పశ్చిమగోదావరి, నెల్లూరుపై 57.37, ప్రకాశం, కర్నూలుపై 74.29, తూర్పుగోదావరి, విశాఖపై 48.28, గుంటూరు, అనంతపురంపై 38.36 విజయం సాధించినట్లు తెలిపారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు

సత్తెనపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ హైస్కూల్ క్రీడా మైదానంలో కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి బాల బాలికల ఫుట్ బాల్



తల పడుతున్న గుంటూరు, చిత్తూరు జట్లు

పోటీలు శనివారం హోరాహోరీగా కొనసాగాయి. బాలుర విభాగం క్వార్టర్ ఫైనల్‌లో విజయనగరం జిల్లా జట్టు ప్రకాశం జిల్లా జట్టు పై 1-0 తేడాతో విజయం సాధించి సెమీ ఫైనల్‌కు చేరుకుంది. బాలికల విభాగంలో విశాఖపట్నం జట్టు పై కడప జిల్లా జట్టు 6-0 తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. గుంటూరు జిల్లా జట్టు పై అనంతపురం జిల్లా జట్టు 4-0 తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

దివ్యాంగ విద్యార్థులకు డీపీటీ ద్వారా పింఛను

బొల్లాపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన దివ్యాంగ విద్యార్థులకు డీపీటీ ద్వారా పించన్‌లను పంపిణీ చేసినట్టు వెల్ఫేర్ అసిస్టెంట్ సంపతు మల్లేశ్వరరావు తెలిపారు. పెన్షన్ పొందే దివ్యాంగులైన విద్యార్థులు దూర ప్రాంతాల్లో ఉండి చదువుకుంటున్నట్లయితే వారికి డీబీటీ ద్వారా బ్యాంకుల్లో నగదు జమ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఎవరైనా ఉన్నట్లయితే విద్యార్థుల స్టడీ సర్టిఫికెట్, బ్యాంకు పాసు పుస్తకం, ఎంపీడీవో ధ్రువీకరిస్తూ పత్రాలు తీసుకొని డీఆర్‌డీఏ పీడీ కార్యాలయంలో అందజేయాలన్నారు.

యూటీఎఫ్ మండల, పట్టణ నూతన కార్యకవర్గం ఎంపిక

నరసరావుపేట టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): యుటీఎఫ్ మండల, పట్టణ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగిందని జిల్లా సహాధ్యక్షుడు ఎం మోహనరావు శనివారం తెలిపారు. మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగిందన్నారు. యుటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడుగా కేఎం మూర్తిరావు, అధ్యక్షుడుగా ఎస్‌కే మస్తాన్ షరీఫ్, ప్రధాన కార్యదర్శిగా పీ సత్యనందరావు, సహాధ్యక్షుడిగా ఎస్‌కే షాహిద్ బాషా, జీ రాఘవమ్మ, కోశాధికారిగా డీఎస్ఎస్ మూర్తి, ఎంపికయ్యారు. యుటీఎఫ్ మున్సిపల్ శాఖకు గౌరవాధ్యక్షుడిగా ఓ కోటేశ్వరరావు, అధ్యక్షుడిగా ఎల్ పూర్ణచంద్రరావు, సహాధ్యక్షుడిగా సీహెచ్ సంపత్‌కుమార్, మహిళా సహాధ్యక్షురాలుగా ఎం సునీత, ప్రధాన కార్యదర్శిగా కే వెంకటేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శిగా ఎస్‌కే అఖీబ్ పాషా ఎన్నిక అయ్యారు. ఆయా కార్యక్రమాలకు పల్నాడు జిల్లా యుటీఎఫ్ అధ్యక్షుడు పీ ప్రేమ్‌కుమార్, జీ విజయసారథి, జిల్లా ఆడిట్ కమీటి సభ్యుడు జీ ఆంజనేయులు, సహాధ్యక్షురాలు భాగేశ్వరిదేవి, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్ సుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్ల మండల కార్యవర్గం

రొంపిచర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రొంపిచర్ల మండల యూటీఎఫ్ కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. నరసరావుపేటలోని మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రాంతీయ శాఖ సమావేశంలో 2024 - 25 సంవత్సరానికి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి, అధ్యక్షుడిగా రామాంజనేయులు, సహాధ్యక్షుడిగా రవి, మహిళా సహాధ్యక్షుడిగా కార్మెల్ మేరీ, ప్రధాన కార్యదర్శిగా లింగారావు, కోశాధికారిగా వెంకటేశ్వరరావులను ఎన్నుకున్నారు.

వైభవంగా శ్రవణా నక్షత్రం పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

నరసరావుపేట అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామి వారికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్ శర్మ స్వామికి అభిషేకాలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. కోటి సోమవారం సందర్భంగా ఆలయంలో జరిగిన పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

కోటి సోమవార పూజలు

రొంపిచర్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో కార్తీక మాసం సందర్భంగా శనివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రొంపిచర్లలోని శంకర స్వామి, విప్పర్లలోని వల్లభేశ్వర స్వామి, వడ్ల మూడివారిపాలెంలోని నీలకంఠేశ్వర స్వామి, గోగులపాడులోని చంద్రమౌళీశ్వర స్వామి, మాచవరం, పరగటిచర్ల గ్రామాల్లోని రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో దీపారాధనలు చేశారు.

ఎరువులకు ఎంతో ప్రాధాన్యం ఉంది

● మున్సిపల్ కమిషనర్ సుభాష్



ఇంటిగ్రేటెడ్ సాలీడ్ వేస్టు మేనేజిమెంట్ ప్లాంట్ ఎరువులను పరిశీలిస్తున్న కమిషనర్

వినుకొండటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : ఎరువులకు ఎంతో ప్రాధాన్యం ఉందని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. పట్టణంలోని కారంపూడిరోడ్డులోని చెక్కవాగు వద్ద గల ఇంటిగ్రేటెడ్ సాలీడ్ వేస్టు మేనేజిమెంట్ ప్లాంట్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఎరువుల తయారీ విధానాన్ని వాటి ఉపయోగాల గురించి సిబ్బందికి చెప్పి, రైతులు ఏవిధంగా ఉపయోగిస్తారో తెలిపారు.

బైపాస్ రోడ్డు పనులు చేపట్టాలి



బైపాస్ రోడ్డును పరిశీలిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారు గుంటూరు రోడ్డు నుంచి ఇస్సపాలెం రోడ్డు వరకు ఉన్న బైపాస్ రోడ్డు పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. పగటిపూట ప్రయాణం చేయాలన్నా నడవలేని పరిస్థితి ఉందని, అర్ధరాత్రి అయితే ప్రమాదాలు జరిగే అవకాశం అధికమన్నారు. శనివారం దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం నాయకులు వై వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జీ రామకృష్ణ, పౌరహక్కుల సంఘం నాయకుడు చికినం చిన్న, బీసీ సంఘాల నాయకుడు బి.శ్రీనివాసరావులు గుంటూరు-కర్నూల్ రోడ్డు నుంచి ఇస్సపాలెం మధ్య ఉన్న బైపాస్ రోడ్డును పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

కూటమి ప్రభుత్వానికి ప్రజలు మద్దతు, దేవుడి ఆశీస్సులు

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ

వినుకొండ నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల మద్దతుతో పాటు, దేవుడి ఆశీస్సులు కూడా ఉన్నాయని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. సంక్షేమ ఫలాలు అందుకుంటున్న కోట్ల మంది ప్రార్థనలు, అవ్వాతాతల దీవెనలు అన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబుకి దైవ బలాన్ని మరింత పెంచుతున్నాయని అన్నారు. శనివారం వినుకొండ మండలం అందుగుల కొత్తపాలెంలో వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాబలంతో పాటు దేవుడి దీవెనలు బాగుండబట్టే చంద్రబాబు నాయుడు చేపట్టిన ప్రతి కార్యక్రమం విజయవంతం అవుతుందని, రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, పరిశ్రమలు, పెట్టుబడులు, కేంద్రం నుంచి నిధులు, పెండింగ్ సమస్యలు అన్నీ సానుకూలంగా ఫలిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో భక్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆదర్శంగా నిలపాలన్నదే కోరిక

వినుకొండటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమం శనివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినుకొండ ప్రాంత ప్రజలు సుఖ శాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. స్వామి దయతో వినుకొండ ప్రాంతాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలపాలన్నదే తన కోరికని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నిశ్శంకర శ్రీనివాసరావు, నాగ శ్రీను రాయల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహారుద్రాభిషేకం ఏర్పాట్ల పరిశీలన

కార్తీక మాసం పుణ్యదినాలను పురస్కరించుకుని ఆదివారం వినుకొండలో మహారుద్రాభిషేకం నిర్వహించబోతున్నట్లు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. పట్టణంలోని జూనియర్ కళాశాల్లో ఆదివారం సాయంత్రం ఆరుగంటలకు భారీ ఎత్తున జరగబోతున్న ఈ కార్యక్రమ ఏర్పాట్లను ఎమ్మెల్యే జీవీ శనివారం పరిశీలించారు. జ్ఞాన ప్రసన్న స్వామీజీ అమ్మ, చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

12వ పీఆర్‌సీ కమిషన్ నియమించి, మధ్యంతర భృతి ప్రకటించాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల



సమావేశంలో మాట్లాడుతున్న చెన్నుపాటి మంజుల

వినుకొండ నవంబరు 9(ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్సీ కమిషన్ నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఏపీ ఎన్జీవో హోమ్‌లో జిల్లా కార్యదర్శి తమ్మిశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల ఉద్యమ అధ్యాయ తరగతులకు ముఖ్యఅతిథిగా చెన్నుపాటి మంజుల పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులకు నిలిచిపోయిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. గత ఆరు నెలలు నుంచి ఉపాధ్యాయులకు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలు వెంటనే చెల్లించాలని చెప్పారు. ఆదేవిధంగా 11వ పీఆర్సీ బకాయిలు, 90 నెలలు నుంచి రావాల్సిన పెండింగ్ డీఏలు ఎప్పుడు విడుదల చేస్తారో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరారు. జీవో 117 రద్దు చేసి, శాస్త్రీయ విద్యావిధానాన్ని అమలు చేయాలన్నారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడు బసవలింగారావు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు మక్కెన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఉస్మాన్. వీవీ రవికుమార్, మహమ్మద్ అలీఖాన్. షేక్ షరీఫ్, గోపీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా కడియాల రమేష్ జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు

నరసరావుపేట టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని పల్నాడు జిల్లా టీడీపీ కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రమేష్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ కేక్‌కట్ చేసి జన్మ దిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పసుమర్రులో న్యాయ విజ్ఞాన సదస్సు



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె నరేంద్రరెడ్డి

చిలకలూరిపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం పసుమర్రులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అయిన కె నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని వారు ఉచిత న్యాయ సహాయాన్ని పొందే విధానం, లోకదాలత్ ద్వారా పొందే ప్రయోజనాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. వివిధ చట్టాల గురించి కూడా ఆయన వివరించారు. న్యాయ విషయాలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే మండల న్యాయ సేవాధికార సంస్థ వారికి లెటర్ ద్వారా తెలియపరచవచ్చునని అన్నారు. హెల్ప్ లైన్ నంబర్ 15100 ను కూడా సంప్రదించవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పీ వెంకటేశ్వరరావు, జీవీ హెచ్ఎస్ ప్రసాద్, ఎం భానుప్రసాద్, రూరల్ ఎస్ఐ జీ అనిల్‌కుమార్, హైస్కూల్ హెచ్ఎం హనుమంతరావు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహంలో ..

నర్సరావుపేట లీగల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్టీ కళాశాల బాలికల వసతి గృహంలో శనివారం న్యాయ సేవల దినోత్సవం నిర్వహించారు. స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అదనపు సీనియర్ సివిల్ న్యాయ అధికారి కే మధుస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత న్యాయ సేవలు పొందే విధివిధానాన్ని వివరించారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా అత్యున్నత స్థానాల్లో ఉండవచ్చునన్నారు. మండల న్యాయ సేవా కమిటీ ద్వారా గత ఏడాదిలో ప్రత్యేక లోక్ అదాలత్‌లు, జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహించి 32 పెండింగ్ వ్యాజ్యాలు, 37 ముందస్తు వ్యాజాలు పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. గత ఏడాది కాలంలో 125 న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించి ప్రజలకు, విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఏడుకొండలు, పీఎల్‌వీ కాంచన, వన్‌టౌన్ ఎస్ఐ అరుణ, వసతి గృహం అధికారి నాగరాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులపై మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి ఖండన

నరసరావుపేట రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నరస రావుపేట నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ అరెస్టుల్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన నరసరావుపేట పట్టణంలో సబ్ జైలును సందర్శించి జైల్లో ఉన్న రావిపాడు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలను పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం రావిపాడులో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని, అతడి వద్ద లేఖలో కొణతం రామకోటేశ్వరరావు, నాగేశ్వరరావు అనే వ్యక్తుల పేర్లు రాశాడని, ఆ లేఖ ఎవరు రాశారో తెలియక పోయినా, కొణతం రామకోటేశ్వరరావు, నాగేశ్వరరావు, రామ కోటేశ్వరరావు అమ్మ, వెంకటేష్ అనే వ్యక్తిని నిన్న అక్రమంగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారన్నారు. రెండు సంవత్సరాల క్రితం ఆత్మహత్య జరిగినప్పటికీ పోలీసులు అప్పటి నుంచి ఎటువంటి యాక్షన్ తీసుకోలేదని, ఆ లేఖ ఎవరు రాశారో తెలుసుకోవడానికి పోలీసువారు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపితే.. ల్యాబ్ వారు మాకు ఎటువంటి ఆధారాలు దొరకలేదని, ఇంకా ఇతను రాసిన పుస్తకాలు ఏమైనా ఉంటే పంపించమని పోలీసు వారిని అడిగారని, లేఖ ఆ వ్యక్తి రాశాడో లేదో రుజువు కాలేదన్నారు. కేవలం వీళ్లిద్దరి పేర్లు లేఖలో ఉన్నాయనే కారణంతో రెండు సంవత్సరాల తర్వాత నిన్న అరెస్టు చేసి జైలుకు పంపించారన్నారు. నాలుగు నెలల నుంచి రామకోటేశ్వరరావు ఇంటి మీద ప్రతిరోజు దాడులు చేస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నారని, ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదని తెలిపారు. అరెస్టు చేసిన వారిని చూడటానికి వచ్చిన కుటుంబసభ్యులను స్టేషన్ ముందే బండబూతులు తిడుతుంటే, పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు తప్ప, వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదన్నారు. ఈ అంశంపై ఎస్పీని కూడా కలిసి రిప్రజంటేషన్ ఇస్తామన్నారు.

● ఎలక్ట్రానిక్ అండ్ మీడియా సభ్యులకు మ్యాక్సీ విజన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక పెద్ద చెరువులోని ఇండి యన్ మెడికల్ అసోసియేషన్ బిల్డింగ్ నందు ఉచిత కంటి వైద్యశిబిరం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మూతపడిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

● స్థలం తిరిగి ఇచ్చేయాలంటున్న దాత



చౌదరినగర్‌లో మూతపడిన చంద్ర లక్ష్మీదేవి ఎంపీపీ పాఠశాల

నరసరావుపేట టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలం లింగంగుంట్లకు చెందిన చంద్ర సూర్యనారాయణ చౌదరి గ్రామ శివారులో ఉన్న చౌదరినగర్‌లో 22 సంవత్సరాల క్రితం పది సెంట్ల స్థలం పాఠశాల కోసం ప్రభుత్వానికి ఉచితంగా అందజేశారు. చాలకాలం దాత తల్లి చంద్ర లక్ష్మీదేవి మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల నిర్వహించారు. ఇక్కడ చదువుకున్న అనేక మంది ఉపాధ్యాయులుగా, ఇంజనీర్లుగా విదేశాల్లో, దేశంలో వివిధ రాష్ట్రాల్లో స్థిరపడ్డారు. ప్రస్తుతం ఆ పాఠశాల మూతపడింది. దీంతో పాఠశాల జూదం, మద్యపానం తదితర అసాంఘీక కార్యక్రమాలకు నెలవుగా మారింది. కేవలం ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌గా మాత్రమే ఉపయోగపడుతుంది.

స్థలదాత సూర్యనారాయణ చౌదరి మాట్లాడుతూ స్థలం పాఠశాల నిర్వహించి పదిమందికి విద్యనందించడానికి ఇచ్చామని అన్నారు. పాఠశాల ప్రయోజనానికి ఉపయోగించనప్పుడు నా స్థలం నాకు తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. గతంలో పల్నాడు జిల్లా మొదటి కలెక్టర్ శివశంకర్ లోతేటికి తెలియజేశానని అన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్న ఆయన ఎన్నికల అనంతరం బదిలీపై వెళ్ళిపోయారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైన స్పందించి పాఠశాల నిర్వహించాలని లేని పక్షంలో స్థలం తనకు అప్పగించాలని కోరారు.

సీపీఎం ప్రజాపోరు ప్రచారయాత్ర

రొంపిచర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రొంపిచర్లలో సీపీఎం ప్రజాపోరు యాత్రలో భాగంగా ధరలపై కరపత్రాలను శనివారం పంపిణీ చేశారు. మండల కార్యదర్శి వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ నిత్యావసర ధరలను అందుబాటులోకి తీసుకురావాలని, విద్యుత్‌చార్జీలు తగ్గించాలని పేర్కొన్నారు. ఈ నెల 14వరకు ఇంటింట ప్రచారం నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టనున్నట్టు తెలిపారు.

వ్యక్తిగత కక్షలతో కుటుంబసభ్యులపై దాడి

చిన్నకంచెర్ల(శావల్యాపురం), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కక్షల నేపథ్యంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై దాడి చేసిన ఘటన చిన్నకంచెర్ల గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు చిన్నకంచెర్ల గ్రామానికి చెందిన దావులూరి మల్లయ్య బజారులో కూర్చుని ఉండగా అదే గ్రామానికి చెందిన గోపు శ్రీనివాసరావు సైకిల్ చైనుతో మల్లయ్యపై దాడి చేశాడు. అనంతరం మల్లయ్య కుటుంబసభ్యులైన మహిళలు బుచ్చమ్మ, అనంతలక్ష్మిలపై కూడా దాడి చేయడంతో వారు తీవ్ర గాయాలపాలయ్యారు. బాధితులు వెంటనే శావల్యాపురంలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తమపై దాడి చేసిన గోపు శ్రీనివాసరావు, మరో ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం చికిత్స నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు తెలిపారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

వినుకొండటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే రెండు రోజులుగా స్టేషన్ సమీపంలో అపస్మారక స్థితిలో పడి ఉన్న వృద్ధుడిని 108సాయంతో వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. అతడి శరీరంపై ఉన్న వస్త్రాలను పరిశీలించి యాచకుడనే అనుమానం వ్యక్తం చేశారు. సమాచారం తెలిసినవారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

బాలింతల నుంచి అక్రమ వసూళ్లు

● చర్యలు తీసుకోవాలని సీపీఎం నిరసన

వినుకొండటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో బాలింతల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో వైద్యశాల వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు హనుమంతారెడ్డి మాట్లాడుతూ వైద్యశాలకు కాన్పుకోసం వచ్చిన మహిళల నుంచి రూ.1000, వసులు చేస్తున్నారని, దీనిపై అధికారులు వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అన్నారు. గతంలో 100 పడకల వైద్యశాలను ఏర్పాటు చేస్తామని గత పాలకులు చెప్పారేతప్ప ప్రజలు ఆశలు నెరవేరలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు వైద్యశాలల్లో జరుగుతున్న అవినీతిని అరికట్టి, నూతన వైద్యశాల నిర్మాణానికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లలో తనిఖీ

నరసరావుపేట రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ తనిఖీ చేశారు. 97- నరసరావుపేట అసెంబ్లీ పరిధిలో ఓటర్లకు 1-1-2025 అర్హత ప్రామాణికంగా ప్రిరివిజన్ యాక్టివిటీస్, రివిజన్ షెడ్యూలు ప్రకారం ఈ నెల 9, 10, 23, 24వ తేదీల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రకటించిన తేదీల్లో ఆయా పోలింగ్ బూతల వద్ద బీఎల్‌వోలు నిర్వహించాల్సిన పనులపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

జియో ట్యాగ్ తప్పనిసరి

బొల్లాపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రభుత్వం వరుసగా కీలక నిర్ణయాలు తీసుకుంటూ.. పాలనాపరంగా కొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందే విధంగా జియో ట్యాగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల నుంచి ప్రతి ఇంటికి జియో ట్యాగ్ తప్పనిసరి చేసింది. ఈ మేరకు వార్డు, గ్రామ సచివాలయ పరిధిల్లో ప్రతి ఇంటికి వెళ్లి ఫింగర్ ప్రింట్‌తో పాటు డోర్ నెంబరు తీసుకొని జియో ట్యాగ్ నిర్వ హిస్తున్నారు.

బీసీజీ టీకాతో క్షయ వ్యాధి నిర్మూలించవచ్చు

● పీహెచ్‌సీ డాక్టర్ నాగేంద్రబాబు





ఈపూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నిర్మూలన కోసం వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించేందుకు సిబ్బంది బృందాలుగా ఏర్పడి ఇంటింటి సర్వే చేస్తున్నారని కొచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నాగేంద్రబాబు తెలిపారు. ఆయన మరికొన్ని విషయాలను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.

ప్ర: సీజనల్ వ్యాధులపై ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

జ: సీజనల్ వ్యాధులు సోకకుండా ఉండేందుకు ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. అందుకోసం ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. జ్వరం, తలనొప్పి, జలుబు ఉంటే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం.

ప్ర: రాష్ట్రీయ బాలల స్వస్థత కార్యక్రమంలో ఏమేమి పరీక్షలు చేస్తారు?

జ: రాష్ట్రీయ బాలల స్వస్థత కార్యక్రమం ద్వారా 44 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారు. 0-18 సంవత్సరాల పిల్లలకు పుట్టుకతో లోపాలు, పోషకాహార, ఎదుగుదల లోపాలపై పరీక్షలు చేస్తారు.

ప్ర: ప్రస్తుతం క్షయ వ్యాధి నివారణ టీకాలు ఎవరెవరికి వేస్తున్నారు?

జ: బీసీజీ టీకాలను 60 సంవత్సరాలు పైబడిన వారికి, 45 సంవత్సరాలు నిండిన షుగర్ రోగులకు, ఐదేళ్లుగా క్షయ వ్యాధితో బాధపడుచున్న వారికి వారి రక్త సంబంధీకులకు, పొగతాగే వారికి చాలా తక్కువ బరువు ఉన్న వారికి టీకాలు వేస్తారు. ఇందుకోసం ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నాం.

ప్ర: క్యాన్సర్ స్ర్కీనింగ్ కార్యక్రమం ఎప్పుడు ప్రారంభమౌతుంది?

జ: క్యాన్సర్ స్ర్కీనింగ్ కార్యక్రమం నవంబరు 14వ తేదీ నుంచి ప్రారంభమౌతుంది. మూడు రకాల క్యాన్సర్‌లకు స్ర్కీనింగ్ నిర్వహిస్తారు. ఏఎన్ఎంలు, సీహెచ్ఏ, ఆశా వర్కర్లులు బృందాలుగా ఏర్పడి ప్రతి మంగళ, గురు, శుక్ర వారాల్లో స్ర్కీనింగ్ పరీక్షలు చేస్తారు.

టీడీపీ కేంద్ర కార్యాలయానికి సమస్యలతో బాధితులు



తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో భాగంగా ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్‌టీఆర్ భవన్‌కు ప్రజలు సమస్యలతో పోటెత్తారని శనివారం పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో భాగంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్హతలు ఉన్నా గత ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వ పథకాలు దక్కని వారు, వైసీపీ నేతల భూకబ్జా బాధితులు వివిధ సమస్యలతో సతమతమవుతున్న వారు అర్జీలు ఇచ్చేందుకు తరలివచ్చారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత వర్ల రామయ్యతో కలసి బాధితులతో ఆత్మీయంగా మాట్లాడి వినతులు స్వీకరించారు. వారి బాధలు శ్రద్ధగా ఆలోచించి తగు న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. బాధితుల సమస్యలపై అధికారులతో చర్చించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌గా గోనుగుంట్ల

రొంపిచర్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రొంపిచర్ల గ్రామానికి చెందిన గోనుగుంట్ల కోటేశ్వరరావు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌గా శనివారం ఎంపికయ్యారు. కూటమి ప్రభుత్వం వెలువరించిన నామినేటెడ్ పదవుల్లో ఆయనకు ఈ అవకాశం దక్కింది. ప్రస్తుతం టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా ఆయన పని చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో, విభజన జరిగిన తరువాత ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర దివ్యాంగుల, వయో వృద్ధుల కార్పొరేషన్‌కు చైర్మన్‌గా పని చేశారు. రొంపిచర్ల గ్రామానికి చెందిన గోనుగుంట్ల వెంకటేశ్వర్లు, స్వరాజ్యమ్మ కుమారుడు ఈయన. 2019, 2024 సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి ఆయన ఎనలేని కృషి చేశారు. మండలంలో కూడా కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తన సేవలను గుర్తించి రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌గా ఎంపిక చేశారు. ఈ మేరకు నియోజకవర్గ కూటమి నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

దివ్యాంగులకు వీల్ చైర్ల పంపిణీ

● ఏఎంరెడ్డి విద్యాసంస్థల సెక్రటరీ అట్లూరి శాంతి జన్మదిన వేడుకలు



దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేస్తున్న కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి తదితరులు

నరసరావుపేట టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి విద్యాసంస్థల సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ముఖ్యమైన ప్రదేశాల్లో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. దివ్యాంగుల కోసం వీల్‌ఛైర్‌లు అందజేశారు. వృద్ధ, అనాథాశ్రమాల్లో అవసరమైన నిత్యావసర సరుకులు, బెడ్ షీట్స్ అందజేశారు. పేదలకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ సీహెచ్ మల్లికార్జున, డిప్లొమో ప్రిన్సిపాల్ జె.కృష్ణారెడ్డి, బీ ఫార్మసీ ప్రిన్సిపాల్ పీ భార్గవ భూషణ్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో జనసేనకు తగిన ప్రాధాన్యం

● పెంటాల బాలాజీ

చిలకలూరిపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో జనసేనకు నామినేటెడ్ పదవుల్లో సరైన ప్రాతినిధ్యం లభించిందని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కోకన్వీనర్ పెంటేల బాలాజీ శనివారం తెలిపారు. మొత్తం 59 పోస్టులకు గాను 10 పోస్టులను మిత్రపక్షమైన జనసేనకు కేటాయించినట్లుగా ఆయన తెలిపారు. పదవులు పొందిన వారందరూ జనసేన పార్టీ ఆరంభం నుంచి పనిచేస్తూ పార్టీకి విధేయులుగా ఉన్న వారేనని అన్నారు. పదవులు పొందిన వారికి ఆయన అభినందనలు తెలిపారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా వ్యవహరించి, పదవులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.